సంపుటి 48 సంచిక 127 ఏప్రిల్ 2020

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే

సహస్రనామతత్తుల్యం రామనామవరాననే

# విషయ సూచిక

**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి**............1

సెక్రెటరీ రిపోర్ట్ – **వాణి మోటమఱ్ఱి** ............2

## శీర్షికలు

శ్రీమద్భగవద్గీత - పెయ్యేటి రంగారావు............4

ఏ ఒక్కరికోసం ఆగను - పద్మజ గొల్లపూడి ............9

ప్రవచన సప్తాహం సమీక్ష - విజయ గొల్లపూడి ............10

కరోనా కుఛ్ కరోనా - జయ సీతంరాజు ............12

తెలుగుభాష గొప్పదనం - పెయ్యేటి శ్రీదేవి ............14

కోవిడ్ అని కోపంగా - ఉషా శ్రీదేవి శ్రీధర ............16

ఈ మాసపు ప్రశ్నావళి ............17

వింత కుటుంబం - పొత్తూరి విజయలక్ష్మి ............20

చిన్నచూపు - రాచకొండ మల్లికార్జునరావు............27

తల్లిప్రకృతి - రంగారావు పెయ్యేటి ............29

దేవుడిని ఏమి కోరుకోవాలి - రాజసుకన్య ఇమ్మడి ............38

అమెరి కారు టోయుట, టోయించుకొనుట - చిట్టెన్ రాజు వంగూరి............39

సంగీతనాదామృతం - పద్మ మల్లెల ............47

రాజా రవివర్మ - విజయ గొల్లపూడి............51

పాట నేర్చుకుందామా / పాడుకుందామా............55

బాలవాహిని............ 57

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |


## సంపాదకీయం

ఏప్రిల్ నెల తెలుగు వాహిని మాసపత్రిక కథలు, శీర్షికలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది మీకందిస్తున్నాము. తెలుగువారంతా శ్రీరామనవమి పర్వదినాన్ని ఇంటికే పరిమితమై బాగా జరుపుకున్నారనుకుంటున్నాము.

అనుకోకుండా ప్రపంచమంతా కరోనా విపత్తు బారినపడటంతో ప్రభుత్వయంత్రాంగం సురక్షిత చర్యలు చేపడుతూ నిబంధనలు జారీ చేస్తున్నారు. చిన్నపుడు పెద్దవాళ్ళు పిల్లలను బూచాడొస్తాడు. బయటకు వెళ్ళకు అని భయపెట్టేవారు. కానీ ఇపుడు బయటకెళ్ళకు కరోనా బూచి అంటుకుంటుంది అని సమస్త ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం నొక్కి వక్కాణించి చెపుతోంది. ఒక్కసారిగా జీవన విధానం, తీరు తెన్నులు మారిపోయి అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రణాళికలో కార్యరూపందాల్చి జరుగబోయే కార్యక్రమాలు ఆగిపోయాయి. అజ్ఞాతంలో గడుపవలసిన పరిస్థితులు, దేశ దేశాలకు మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి.

ఎన్ని విపత్తులు వచ్చినా మన భారతీయులందరికీ అత్యంత శక్తివంతమైన ఆయుధం భగవన్నామ జపం ధైర్యాన్నిస్తుంది. విలువైన ప్రవచనాలు, పవిత్ర భగవంతుని గ్రంథాలు, స్తోత్రాలు, నామాలు మనకు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ మానవజీవన మనుగడకు ఆలంబనగా నిలుస్తాయి. సాధన ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత, మనోవికాసం అలవడతాయి అనడంలో సందేహం లేదు.

ప్రస్తుత ఈ పరిస్థితి తాత్కాలికమే అయినా సరైన జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటూ......

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**


### ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: సతీష్ వరదరాజు
0408 469 758


వైస్ ప్రెసిడెంట్: శ్రీ మధు బైరెడ్డి
0425 209 397


సెక్రెటరీ: వాణి మోటమఱ్ఱి
0418 184 111


ట్రెసరర్:మూర్తి ఓలేటి
0402 137 475


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: మోహన్ కుమార్ పరస్సు 0419 219 526


కమిటీ మెంబర్: హరిబాబు కొల్లూరి
0425 291 032

### సబ్ కమిటీలు


వాణి కన్వీనర్ : సారథి మోటమఱ్ఱి
0430 002 130


వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు స్కూల్ కోఆర్డినేటర్
మల్లిక్ రాచకొండ 0431 680 092


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నెలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0400 031 546


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

### UIA మెంబర్


శ్రీని పిల్లమఱ్ఱి
0452 025 666

### ఫైనాన్సియల్ అడ్వైసరి కమిటీ (FAC)


మూర్తి పోతుకూచి


శ్రీనాధ్ ఖండవల్లి


సుందరం రాచకొండ


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear STA Members and friends,

ముందుగా మీ అందరికీ మరొక్కసారి శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు.

Brahmasri Samavedam Shanmukhasarma gari week long Pravachanam sessions in Sydney (from 4th March to 10th March 2020) at Strathfield South Public School, 457 Liverpool Rd, Strathfield South, NSW 2135 were well received with significant attendance. Sydney Telugu Association has felicitated guruvu garu for his marvellous contributions and conferred the title "ప్రవాస భారతీయ అధ్యాత్మ బంధు" to him on Sunday, 8th March 2020 following the day's Pravachanam session. Guruvu garu reached India on 13th March cutting short his Australian trip due to the travel advice he received following the spread of Corona Virus.

It is very disappointing to call-off Vanitha Mandali's "Women's Day and Holi Event" and Vahini team's "Sahithi Sadassu" due to the current COVID-19 situation.

As social distancing rules have tightened, the Australian federal government over the weekend has launched a new coronavirus information app and WhatsApp chat feature for keeping up to date with messaging coming out of Canberra as a trusted place of advice on the COVID-19 outbreak, and made telehealth services available country-wide

In addition to providing information and advice, the app also has a registration feature for self-isolation. People can gain access to a new messaging service on WhatsApp by typing oz.gov.au/whatsapp. Coronavirus Australia app is available from the Apple App Store and on Google Play, was launched alongside the Government's new WhatsApp feature

From 8 am Monday, telehealth services were made available to all Australians. Services will include GP services and some consultation services provided by other medical specialists, nurse practitioners, mental health treatment, chronic disease management, Aboriginal and Torres Strait Islander health assessments, services to people with eating disorders, pregnancy support counselling, services to patients in aged care facilities, children with autism, and after-hours consultations. The aim is to take pressure off hospitals and emergency departments. https://preview.nsw.gov.au/covid-19

- During this difficult time, if any of you need help, please contact the STA Executive Committee via ec@sydneytelugu.org or by calling us direct on the mobiles – for details, please visit www.SydneyTelugu.org.
- Let's welcome Mr. Madhu Maddali, a new Life Member into our STA family.
- Postponed - Sunday, 17 May 2020 – STA Sarvari Ugadi 2020, Sangetha Vibhavari Event. This event is currently postponed for the time being. Will provide updated dates once the COVID-19 situation gets better.
- Help Stop the Spread and Stay Healthy

మీ అందరికీ శ్రీరామనవమి, Easter పండుగ శుభాకాంక్షలు.

Best Regards,

Vani Saradhi Motamarri,

Secretary, Sydney Telugu Association

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖


**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



అధ ప్రథమోధ్యాయః = అర్జున విషాదయోగః  (మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగము)

అధ ప్రథమోధ్యాయః = అర్జున విషాదయోగః (మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగము)

15.

పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః |

పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః || 15 ||

హృషీకేశః = మాయకు ప్రభువగు శ్రీకృష్ణపరమాత్మ

పాంచజన్యం = పాంచజన్యమను శంఖమును

ధనంజయః = సకల దేశాధీశ్వరులను జయించి ధనంజయుండను పేరునొందిన అర్జునుడు

దేవదత్తం = దేవదత్తమను శంఖమును

భీమకర్మా = యుద్ధమునందు భయంకరమగు కర్మను జేయునట్టియు

వృకోదరః = అంగుష్టప్రమాణము గల జఠరాగ్ని కల భీముడు

పౌండ్రం = పౌండ్రమను పేరుగల

మహాశంఖం = గొప్ప శంఖమును

దధ్మౌ = పూరించెను.

శ్రీకృష్ణపరమాత్మ తన పాంచజన్యమును, అర్జునుడు తన దేవదత్తమును, భీముడు తన పౌండ్రమను శంఖమును పూరించిరి. పంచజనుడనే రాక్షసుని ఎముకలచే ఏర్పడినది పాంచజన్యం. రాజసూయ యాగానికి అనేక రాజుల నుంచి ధనమును సంపాదించి తెచ్చినందు వల్లను, ధనాన్ని గూర్చిన ఆశను జయించిన వాడవటం వల్లను అర్జునుడికి ధనంజయుడు అని పేరు వచ్చింది. అన్నిటిని భస్మం చేసే వృకము అనే అగ్ని ఉదరంలో కలిగి వున్నందు వల్లను, వృకము అనగా తోడేలు యొక్క ఉదరము వంటి ఉదరము కలవాడు కనుకనున్ను భీముడికి వృకోదరుడు అన్న పేరు వచ్చింది.

16.

అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః |

నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ||16 ||

కుంతీపుత్రః = కుంతీదేవి యొక్క కుమారుడును

రాజా = రాజును అగు

యుధిష్టిరః = యుధిష్ఠురుడు

అనంతవిజయమ్ = అనంతవిజయము అను పేరు గల శంఖమును

నకులః = నకులుడు

సహదేవః, చ = సహదేవుడును

సుఘోష మణిపుష్పకాః = సుఘోషము, మణిపుష్పకము అను పేర్లు గల శంఖములను పూరించిరి.

రాజు, కుంతీపుత్రుడు అగు యుధిష్ఠిరుడు అనంతవిజయము అను శంఖమును, నకులుడు సుఘోషము, సహదేవుడు మణిపుష్పకము అను శంఖములను పూరించిరి.

17,18.

కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః |

ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః || 17 ||

ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే |

సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ || 18 ||

పృథివీపతే = ఓ రాజా!

పరమేష్వాసః = శ్రేష్ఠమైన ధనుస్సు గల

కాశ్యః, చ = కాశీరాజును

మహారథః = మహారథుడైన

శిఖండీ, చ = శిఖండియును

ధృష్టద్యుమ్నః, చ = ధృష్టద్యుమ్నుడును

విరాటః, చ = విరాటరాజును

అపరాజితః = అజేయుడైన

సాత్యకిః = సాత్యకియు

ద్రుపదః, చ = ద్రుపదమహారాజును

ద్రౌపదేయాః, చ = ద్రౌపది యొక్క కుమారులైదుగురును

మహాబాహుః = గొప్ప బాహువులు కలవాడైన

సౌభద్రః = అభిమన్యుడును

సర్వశః = అన్ని వైపుల నుండి

పృథక్-పృథక్ = వేర్వేరుగ

శంఖాన్ = శంఖములను

దధ్ముః = పూరించిరి.

ఓ రాజా! మహాధనుర్ధారి అయిన కాశీరాజు, మహారథుడైన శిఖండియు, ధృష్టద్యుమ్నుడును, విరాటరాజు, అజేయుడైన సాత్యకియు, ద్రుపదమహారాజు, ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులు, భుజబలశాలి యగు సుభద్రాతనయుడు అభిమన్యుడును తమ తమ శంఖములను వేరు వేరుగా పూరించిరి.

19.

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ |

నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ||19 ||

చ = మరియు

సః = ఆ (అట్టి)

తుములః = భయంకరమైన

ఘోషః = ధ్వని

నభః, చ = ఆకాశమును

పృథివీమ్, ఏవ = భూమిని గూడ

వ్యనునాదయన్ = ప్రతిధ్వనింప జేయుచు

ధార్తరాష్ట్రాణామ్ = ధృతరాష్ట్రుని పుత్రుల యొక్క

హృదయాని = గుండెలను

వ్యదారయత్ = వికలము జేసెను.

పాండవ సైన్యములోని యోధులు పూరించిన శంఖనాదములకు భూమ్యాకాశములు దద్దరిల్లినవి. ఆ శంఖారావములకు ధార్తరాష్ట్రుల హృదయములు కకావికలైనవి.

20, 21.

అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః |

ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ||20 ||

హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే |

అర్జున ఉవాచ:

సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత || 21 ||

మహీపతే = ఓ రాజా!

అథ = అనంతరము

కపిధ్వజః = కపిధ్వజుడైన

పాండవః = అర్జునుడు

వ్యవస్థితాన్ = యుద్ధసన్నద్ధులై నిలచియున్న

ధార్తరాష్ట్రాన్ = ధృతరాష్ట్రునికి సంబంధించిన వారిని

దృష్ట్వా = చూచి ||20||

తదా = అప్పుడు

శస్త్రసంపాతే = శస్త్రములను

ప్రవృత్తే = ప్రయోగించుటకు సన్నద్ధుడై యున్న సమయమున

ధనుః = ధనుస్సును

ఉద్యమ్య = పైకెత్తి

హృషీకేశమ్ = శ్రీకృష్ణునితో

ఇదమ్, వాక్యమ్ = ఈ వాక్యమును

అహ = పలికెను.

అచ్యుత = హే కృష్ణా! (నాశము లేని వాడా!)

మే, రథమ్ = నా రథమును

ఉభయోః = ఉభయపక్షముల యొక్క

సేనయోః మధ్యే = సేనల మధ్య

స్థాపయ = నిలిపియుంచుము. ||21||

ఓ ధృతరాష్ట్ర మహారాజా! పిమ్మట యుద్ధమునకై నడుము బిగించి సమర సన్నద్ధులై యున్న ధార్తరాష్ట్రులను చూచి, కపిధ్వజుడైన అర్జునుడు ధనుస్సును పైకెత్తి శ్రీకృష్ణునితో ఇట్లనెను, 'ఓ అచ్యుతా! నా రథమును ఉభయసేనల మధ్య నిలుపుము.

కపిధ్వజుడు = భారతం లోని అరణ్యపర్వంలో భీముని ప్రార్ధనను అనుసరించి హనుమంతుడు తాను పాండవులకి విజయం చేకూరే నిమిత్తం అర్జునుని రథం యొక్క పై భాగాన కూర్చుని వుంటానని వరమిచ్చాడు. అందువలన అర్జునునికి ఈ పేరు వచ్చింది.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

❖❖❖❖❖



# ఏ ఒక్కరి కోసం ఆగను

పద్మజ గొల్లపూడి, హైద్రాబాద్

అంతు చిక్కని ప్రయాణం..

ఎదురులేని నా పయనం

దారి దిక్కు ఎరుగను..

ఏ ఒక్కరి కోసం ఆగను

కాలాలు నా గుప్పెట్లో..

యుగాలు నా వాకిలిలో

చెరిగిపోను నేను..

మరచిపోరు నన్ను

నేను కలసివస్తే..

చోరుడైనా వాల్మీకి కాగలడు

నేను కలిసి రాకున్న..

శ్రీ రాముడైన వనవాసమేగుదును

ప్రజలందరూ..నాకు దాసోహం

నన్ను తిరిగి రాద్దాం అనుకోడం..అజ్ఞానం

నా పుట్టుకకు ఒక క్షణం..చావుకు మరొక క్షణం

జీవిత కాలం..అనంతం!

జాగ్రత్త! నేను ఎవరినో కాను

నేను మీ సమయం!!




❖❖❖❖❖

# బ్రహ్మశ్రీ సామవేద షణ్ముఖశర్మ గారి ప్రవచన సప్తాహం- సమీక్ష

శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ




సిడ్నీ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎపుడెపుడా అని ఎదురుచూసిన బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారి ప్రవచన సప్తాహం దిగ్విజయంగా ముగిసింది. వారు అడుగిడిన శుభతరుణంలో వాతావరణం మలయమారుతంలా అనుకూలించింది. ప్రవచనానికి విచ్చేసిన అందరికీ కాదనకుండా వాత్సల్యంగా పలుకరించి వారి స్వహస్తాలతో ప్రసాదాన్ని ఇచ్చి దీవించారు. గురువుగారికి మొదటిరోజు పూర్ణకుంభంతో, పండితుల వేదనాదాలతో ఘనస్వాగతం పలికారు. డా. సుందరం రాచకొండ దంపతులు సిడ్నీలో ప్రవచనధారకు 2009 సంవత్సరంలో శ్రీకారం చుట్టారు.

నిజజీవితంలో గురువుయొక్క ఆవశ్యకత, సరైనగురువును ఎన్నుకునే మార్గం గురించి మొట్టమొదటి రోజున పరిచయంగా మొదలై, ఆపైన శ్రీ గురుదత్తాత్రేయ వైభవం గురించి చాలా అద్భుతంగా తనదైన ప్రత్యేకశైలిలో శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు విశదీకరించారు. ఆయన సాక్షాత్ గురువుగా భగవత్ బంధువులందరిచే నామస్మరణ చేయించటం ఎంతో అదృష్టం.

ఇంకా శ్రీ వేంకటేశ్వర వైభవం, ఏడుకొండల ప్రాశస్త్యం, అన్నమాచార్యులవారి సంకీర్తనలు ఎంతో వివరంగా తెలియచేసిన తీరు అద్వితీయం.

అపుడే మెల్లిగా ప్రబలుతున్న కరోనా వైరస్ గురించి భయం వలదు. భగవంతుని నామస్మరణ చేయండి అంటూ, ప్రత్యేకంగా అందరిచేత కాలభైరవాష్టకం మననం చేయించారు. విచ్చేసిన భక్తులందరికీ శ్రీ కాశీవైభవం ద్వారా కాశీ విశ్వేశ్వరుని కనులముందు సాక్షాత్కరింపచేసారు. చివరిరోజు ప్రవచనంలో శ్రీ ఆంజనేయ వైభవం అత్యంత రమణీయంగా ముగిసింది.

సిడ్నీ తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ సతీష్ బాబు వరదరాజుగారు గురువుగారిని **"ప్రవాస భారతీయ అధ్యాత్మ బంధు"** బిరుదు జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

ఈ సప్తాహ ప్రవచనంలో కార్యక్రమం మొదలయ్యే ముందు డా. పద్మ మల్లెల గారి నేతృత్వంలో వారి బృందం శ్రీ సామవేదం షణ్ముఖశర్మ గారు రచించిన శివపదం గీతమాలికలతో వీనులవిందు చేసారు.

ఈ ప్రవచన కార్యక్రమాలకు కోశాధికారిగా శ్రీ గోపీకృష్ణ రాఘువులు గారు బాధ్యతలు నిర్వహించారు. శ్రీ కొల్లూరి శ్రీనివాస శర్మగారు వారి బృందంతో అనర్గళంగా సాగిన వేదపఠనం అందరినీ అబ్బురపరిచింది.

ఇక ప్రవచనాలకు విచ్చేసిన వారందరికీ అక్షయపాత్రలా ఆహారాన్ని మహిళలచే తయారుచేయించి ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా అన్నపూర్ణగా వ్యవహరించారు శ్రీమతి వనజ ఖండవల్లి.

స్థానికంగా శ్రీ వేదగాయత్రి పరిషత్ గురువందన కార్యక్రమం ద్వారా పాదపూజ తో గురువుగారిని గౌరవించుకున్నారు.
ఇన్ ఫినిటీ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీ రాజగోపాల్ మద్దాలి గారు విద్యార్థులకోసం గురువుగారితో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించటం హర్షణీయం.
ఏ కార్యక్రమమైనా దిగ్విజయంగా జరుగాలంటే వాలంటీర్ల సహాయం ఎంతో ముఖ్యం. శ్రీ సాయి లక్ష్మీనారాయణగారు వాలంటీర్ కో-ఆర్డినేటర్ గా ఎంతో నేర్పుగా వాలంటీర్లకు బాధ్యతలు సరిసమానంగా అప్పగించారు. ధ్వని సహకరణ లో శ్రీ పోలా వరప్రసాద్ గారు చేయూతనిచ్చారు.
శ్రీ అనంతసాయి పరశ గారు గురువు గారి పలు ప్రవచన ఆడియోలు, ఋషిపీఠం పుస్తకాలు స్టాలు లో విక్రయించారు.
ఏ అంతరాయం కలుగకుండా ప్రవచన సప్తాహయజ్ఞానికి హాజరై గురువుగారి ప్రవనామృతాన్ని అందుకున్న సిడ్నీవాసులు భాగ్యవంతులు అని చెప్పక తప్పదు.
కొన్ని చిత్రమాలికలు ఇక్కడ పొందుపరిచాము.















# కరోనా..కుఛ్..కరోనా

శ్రీమతి జయ సీతంరాజు, సిడ్నీ

ప్రతీ ఒక పని కి ఆది,అంతం వుంటాయి..ఆది నుంచి మానవుడు తను చేసే ప్రతీ పని తను నిర్దేశించుకున్న తీరుగా చేసుకుంటూ..తన క్రియలకు తానే అధికారి గా పొంగిపోయాడు. తన అధికారం, ధనం,పేరు,ప్రతిష్ఠలను,అందం చూసుకుని మురిసిపోయాడు. పాతాళం లో కి వెళ్ళాడూ చందమామ పై కూర్చున్నాడు. డ్రైవరు లేని కారు, రైలు నడిపించాడు. రోబోలతో హోటళ్ళు నడుపుతున్నాడు పొంగిపోయాడు. గుండెకు గుండె అమర్చాడు, టెస్ట్యూబ్ నించి పసికందుకు ప్రాణం ఇచ్చాడు గర్వంగా తల ఎత్తుకు తిరిగాడు డిశంబరు 2019 వరకు..

ఇక మన దేశంలో ఈ సంవత్సరం వచ్చిన బుష్ ఫైర్లకు మానవజాతి,పశు వృక్ష సంపదలు తల్లడిల్లిపోయాయి. ఆ మానసిక వేదన, ధన,ఆస్తి,మానవ నష్టాలనుంచి కోలుకోక ముందే..ప్రపంచం పై ఈ కరోనా విష పంజాలను పెద జల్లింది. మానవ వునికికే ముసలం తెచ్చింది ఈ మహమ్మారి. ఎక్కడో ఏదేశం లోనో పుట్టాయట విషజీవులు మనకెందుకులే అని దేశాలన్నీ తమ మనుగడ సాగిస్తున్న సందర్భంలో..వస్తున్నా ఆగండీ అంటూ తన ఉనికి ని చాటి చెపుతూ అన్ని దేశాలలోకి ఆఘమేఘలమీద సాగించింది తన ప్రయాణం. అంతవరకు తనను మించిన వాడులేడు అనుకున్న మానవుడు గడ గడ లాడుతూ రైలు ఎక్కినా,బస్సుఎక్కినా,కారు ఎక్కినా,ప్రక్కన నిలబడిన తోటిమానవుడి వునికి చూసినా వులిక్కి పడటం కాదు గుండె ఘుబేల్ మనేలా చేశింది కరోనా.

కంటితో చూస్తే కరోనా,గాలి పీలిస్తే కరోనా,తుమ్మితే కరోనా,దగ్గితే కరోనా,దగ్గరగా నిలబడితే కరోనా.మానవ సంబంధాలన్నీ మటుమాయం,ప్రేమతో పలకరించే వ్యక్తి పది అడుగుల దూరం, కష్టం లో నేనున్నానూ అని అక్కున చేర్చే మనిషి మాయం. కరోనాకు ప్రైమ్ మినిష్టరైనా ఒకటే పనిమనిషైనా ఒకటే అంతం చూస్తుంది. ప్రపంచాన్ని కొనగలడేమోరాజు కానీ కరోనాకి తలవొగ్గాల్సిందే.

అప్పటిదాకా వీరవిహారం చేస్తున్న ప్రజాజీవనం స్థంభించింది,మన ఇంటితలుపునే కరోనా తడితే ఏంటీ గతి? అని 8మిలియన్ల సిడ్నీ వాసుల గుండెల్లో రైళ్ళు. సూర్యుడుదయించక ముందే సూపర్ మార్కెట్ల కు పరుగు భవిష్యులో తినటానికి దొరకదేమోఅని త్రోక్కిసలాటలు,భీతి,ఆవేశం,ఆవేదన ,తోటిమానవుడిగురించి ఆలోచించే సమయంలేదు. పక్కవాడుతుమ్మితే అణుబాంబుపేలిన భీతి,ఆమడదూరం పరుగు.పరదేశ ప్రయాణం రద్దు ధిక్కరించినవారు స్వగృహంలోనే 14రోజుల బందీ అనిపించింది కరోనా. అటు పెళ్ళిళ్ళు,శుభకార్యాలూ వాయిదా,అలాగే పరలోకానికి పోయినవాడికి బై చెప్పటానికి పదిమంది చేరకూడదనే నిఘాలు తెప్పించింది కరోనా. ఆరు పదులు దాటిన అమ్మా నాన్న లకు వెన్నులోంచి వణుకు తెప్పించింది.కరోనా.మనుమలు,మనమరాండ్రలను మా ఇంటికి రావద్దు అని తాతమ్మ,అమ్మమ్మ నోట చెప్పించింది కరోనా.అదే మానవసంబంధాలకు ముప్పుచేశింది కరోనా.

ఇప్పుడు చెప్పాలి మానవుడు తన ఉనికి కరోనా కాలి గోటికి సరిపోదని. ఎందుకూ ఈ అహం, అధికార మోహం, పదవీ దాహం, బంధాలూ,బాంధవ్యాలు, ఒక పరమాణువు ను చూసి గుండెపగిలేలా భయం,నిద్రలేని రాత్రులు. ఎవరు ఎప్పుడు కరోనాకి బలి? అని అణుక్షణం ఒణికిపోయే పరిస్థితి కి తెచ్చింది..కరోనా.

**సూక్ష్మ జీవికి తలవొగ్గిన మానవుడా నిరుత్సాహ పడకు, వస్తుందీ ఒకరోజు నీకూ దాడి చెయ్యి కరోనా పై!**

**కనిపెట్టు అంతాన్ని కరోనా మంత్రాన్ని...ఎత్తుకు పై ఎత్తువేయి కరోనాని చిత్తు చేయి**

❖❖❖❖❖

సిడ్నీ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలోమార్చి 29 వ తేదీన జరుగవలసిన వాహిని వార్షికోత్సవ రెండవ సాహితీ సదస్సు వాయిదా వేయడమైనది. ప్రస్తుతం కరోనా వైరస్ వలన రోజురోజుకి పరిస్థితులు మారిపోతున్న తరుణంలో ముందస్తుగానే నిర్ణయం తీసుకుని కార్యక్రమం ఆ రోజుకు రద్దు చేయడమైనది.

వాహిని సాహితీ సదస్సుకై వక్తలు అంశాలను ఎన్నుకుని ఉత్సాహంగా ముందుకు వచ్చారు. అలాగే ఈ సదస్సు నిర్వహణకై వాలంటీర్లు, స్పాన్సర్లు వారి మద్దతునిస్తూ సహకారాన్ని అందించటానికి సమాయుత్తమైనారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ అంశానికి మెరుగులు పెడుతూ తెలుగు సాహిత్యంలో మీ ఆసక్తిని ఇలాగే కొనసాగించగలరని భావిస్తున్నాము.

కరోనా వ్యాధి ఉధృతి నిర్మూలనమై, పరిస్థితులు అన్నీ చక్కబడి, ప్రభుత్వ నిబంధనలు సడలించాక వాహిని సాహితీసదస్సు తేదీ గురించి సిడ్నీ తెలుగు అసోసియేషన్ కార్యనిర్వాహకవర్గం తో సంప్రదించి మీకు తెలియచేయగలము.

ప్రస్తుత పరిస్థితులలో మీరంతా అప్రమత్తంగా ఉండి, తగు జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితంగా ఉండాలని ఆశిస్తున్నాము.



❖❖❖❖❖

# తెలుగు భాష గొప్పదనం

పెయ్యేటి శ్రీదేవి

అందమైన అమ్మ భాష
అదే మన తెలుగు భాష
అందరిని అలరించు
తీయ తేనియలొలుకు
తేట తెలుగు భాష

కనులకింపుగనుండే
గుండ్రంగా వుండే
అందమైన వ్రాత
మన తెలుగుభాష

లక్ష ఒత్తుల పదధ్వనులతో
దేవుని భక్తితో నుతియించు
స్తోత్రాలతో
అసందర్భపు ఏ పదాలనైనా పూరించు
ఏ భాషలో లేని అవధాన ప్రక్రియలతో
బాసిల్లుతూ, అందాల విరజిమ్ము
భాషే మన తెలుగు భాష

నన్నయ, తిక్కన, ఎఱ్ఱన,పోతన
మొదలైన కవులు ఎన్నో పద్యాలు రచించారు
ఆశువుగా కవితలల్లారు
అలాంటి ఎంతో వినసొంపైన
ఎంతో అద్భుతమైన పద్యాలు,
అందమైన చిట్టిపొట్టి నానీకవితలు
మన తెలుగు భాషకే సొంతం
ప్రపంచభాషలన్నింటిలోన

ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్
అని పేరెన్నిక గన్న భాష మన తెలుగు భాష

దేశభాషలందు తెలుగు లెస్స అని
కన్నడ రాజు శ్రీకృష్ణదేవరాయలు కీర్తించనదీ
ఈ తెలుగు భాషనే
సి.పి.బ్రౌన్ అన్న ఆంగ్లేయుడు
తెలుగు మాటలకి ఆంగ్లపదాల
నిఘంటువు రాసాడు ఈ తెలుగుభాషాభిమానంతోనే

ఇలా మన తెలుగు భాష గొప్పతనాన్ని
అందరూ శ్లాఘించారు.
మనమూ మన మాతృభాషని
అభివృద్ధి చేసుకుంటూ
మనందరం తెలుగులోనే మాట్లాడుదాం

మా తెలుగుతల్లికీ మల్లెపూదండ
మా కన్నతల్లికీ మంగళారతులు
జై తెలుగుతల్లీ!
జైజై తెలుగుభాష!!
**************



## కోవిడ్ అని కోపంగా వేలమార్లు వాపోయేకన్నా....

శ్రీమతి ఉషాశ్రీదేవి శ్రీధర, సిడ్నీ



కోదండరామా అంటే శాంతి

గోకులబాంధవా అంటే ఆర్తి

కోనేటిరాయడా అంటే ముక్తి

గోవర్ధనోద్ధారకా అంటే శక్తి

కోటిసూర్యప్రకాశా అంటే దీప్తి

గోపకాంతా మానసచోరా అంటే రక్తి

కోటిరత్న ప్రభాతేజా అంటే కాంతి

గోవిందా అంటే మరిక జన్మకు విముక్తి!!

❖❖❖❖❖

# వాహిని ఈ మాసపు ప్రశ్నావళి

**'వాహిని'** మాసపత్రికలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినవారిలో **ఒకరికి Just Cakes** వారిచే $25 విలువ గల Gift Voucher కానుకగా అందించబడుతుంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు Vahini@sydneytelugu.org e-mail కు ఏప్రిల్ 25 వ తేదీలోగా పంపగలరు.

- మాండలీకాలు అంటే ఏమిటి. నాలుగు ఉదాహరణలు ఇవ్వండి.
- బుడుగు అంటే ఎవరు?

గత మాసపు ప్రశ్నావళి సమాధానాలు:

- 'రాజశేఖర చరిత్ర' నవలను రచించినదెవరు?
- వ్యంజనములు అనగా ఏమి?

సమాధానాలు:

**శ్రీమతి విజయ చావలి, సిడ్నీ**

1. **రాజశేఖర చరిత్రను** రచించిన వారు **కందుకూరి  వీరేశలింగం గారు**.

   ఇది ఆంధ్ర దేశములో **తొలి నవల** గా ప్రసిద్ధి .ఇది 1878లో రచించేరు.

   ఈ నవలలో సాంఘీక దురాచారాల్ని హేళన చేసి విమర్శించడం జరిగింది. సమకాలీన  పరిస్థితులు చక్కగా వివరించేరు. అంధ మూఢ విశ్వాసాలు,వాటి వల్ల జరుగుతున్న మోసాలు, సమకాలీన  పరిస్థితులు, ఆధునిక సంస్కరణలు వివరించబడ్డాయి.

2. వ్యంజనములంటే **హల్లులు**.  తెలుగు భాషలో 36

క,ఖ,గ,ఘ,ఙ

చ,ఛ, జ ,ఝ ,ఞ

ట,ఠ,డ,ఢ,ణ

త ,థ ,ద ,ధ ,న

ప ,ఫ, బ ,భ ,మ

య ,ర ,ల ,ళ, వ, శ, ష, స ,హ ,క్ష,  ఱ

**శ్రీమతి షామీర్ జానకీ దేవి, హైద్రాబాద్**

'రాజ శేఖర చరిత్రము' వ్రాసిన వారు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారు...

1) ఆయన గొప్ప సంఘ సంస్కర్త, స్త్రీల ఉన్నతి కొరకు ఉద్యమించి నాటి బాల్య వివాహాలను వ్యతిరేకించి వితంతు పునర్వివాహాలను జరిపించటానికి ఎంతో పాటుపడ్డారు...
2) సమకాలీన కాలాన్ని ప్రతిబింబించే విధంగా తన రచనలు అందించారు... అంధ విశ్వాసాలను, అవివేకపు ఆచారాలను తొలగించే ప్రయత్నం చేసారు...
3) బ్రహ్మ సమాజాన్ని స్థాపించి, సమాజ సేవ కొరకు 'హితకారిణి' అనే ధర్మ సంస్థను స్థాపించి తన యావదాస్తిని ఇచ్చేసారు...
4) నవలా శకానికి యుగ కర్తగా ప్రసిద్ది చెందిన ఆయనకు 'గద్య తిక్కన' అనే బిరుదు ఉంది... తొలి వచన నవలకు ఆయనే ఆద్యుడు...
5) మగ పిల్లలతో ఆడపిల్లలు కలసి చదువుకునేందుకు కుల రహిత విద్యా విధానాన్ని ఆయన ప్రవేశ పెట్టారు...

**వ్యంజనములు అనగా 'హల్లులు'**

**ఈ మాసం మార్చి 2020 క్విజ్ విజేత శ్రీమతి విజయ చావలి, సిడ్నీ**






❖❖❖❖❖



తెలుగు అసోసియేషన్ సిడ్నీ
TELUGU ASSOCIATION INC.,SYDNEY
WELCOMES
www.facebook.com/sydneytelugu
శ్రీ శార్వరి
ఉగాది 2020
సంగీత విభావరి
LIVE CONCERT
Postponed
SUNITHA
SIRI SAMPADA
9 Quarry Rd,Dural NSW 2158
VVIP $100
VIP $50
ADULT $20
CHILD $10
LIFE MEMBER STUDENT $15
FARE INCLUDES DINNER
TaxNET
Venkat Kantpudi,
Mortgage Broker & Tax Agent
Mobile: 0421374365
INDAUS IMMIGRATION
Swagath
Sweet UTSAV
RAILWAY ROAD
RRMC MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE
RAY
Dosa Hut
Designed by DSLRcrew - 0403226300
For sponsorships, stalls at the venue , contact EC members
For Further Details & Tickets Contact: Madhu Byreddy 0425209397 | Vani Motamarri 0418184111
Murthy Voleti 0402137475 || Mohan Kumar Parasu 0419219526 || Hari Kolluri 0425291032| Raj Gunnam 0431712501
President: SATEESH BV RAJU Mobile: 0408469758 Email: ec@sydneytelugu.org

# వింత కుటుంబం

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి, హైద్రాబాద్

అదో డ్యూప్లెక్స్ ఇల్లు. ఇంటి పేరు హరివిల్లు. ఆ ఇంట్లో మూడు తరాలవాళ్లు వుంటున్నారు. మొదటితరం మనిషి రామ్మూర్తి. సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగం చేసి రెండేళ్ల క్రిందట పదవీ విరమణ చేశాడు. ఆయన భార్య సుమిత్ర.

రెండోతరం వాడు రవితేజ. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అతని భార్య ఉష. మూడోతరం వాడు ఆదిత్య. వాడికి అయిదేళ్లు. ఒకటో తరగతి చదువుతున్నాడు.

తెల్లవారింది. సుమిత్ర వంటింట్లో కాఫీ పెడుతోంది. పైన ఉన్న నీటి టాంక్ నిండి నీళ్లు కిందకి పోతున్నాయి.

''ఉషా, మోటర్ ఆపేయ్, నీళ్లు పోతున్నాయి,'' అంది కోడలితో.

ఉష ఆదిత్యని తయారుచేస్తోంది. అందుకే, ''రవీ, మోటర్ ఆపేయ్. నీళ్లు పోతున్నాయి,'' అని మొగుడికి చెప్పింది.

రవి ట్రెడ్‌మిల్ మీద వ్యాయామం చేస్తున్నాడు. అందుకే, ''నాన్నగారూ, కాస్త మోటర్ ఆపండి. నీళ్లు పోతున్నాయ్,'' అని తండ్రికి చెప్పాడు.

ఆయన వరండాలో కూర్చుని పేపరు చదువుకొంటున్నాడు. ''సుమిత్రా, మోటర్ ఆపేయ్, నీళ్లు పోతున్నాయి,'' అని పొలికేక పెట్టాడు.

తను చెప్పినపని గోడకి కొట్టిన బంతిలా తిరిగి తన దగ్గరకే వచ్చేసరికి సుమిత్రకి చిర్రెత్తుకొచ్చింది. 'ఛ, నేను బతికుండగా ఈ సంసారం బాగుపడదు,' అని విసుక్కుంటూ వెళ్లి మోటర్ ఆపేసింది. కాఫీ కోసం అందరూ హాల్లో చేరినప్పుడు ఆ విషయం లేవనెత్తి అందరికీ అక్షింతలు వేసింది.

''నా చెయ్యి ఖాళీలేదు, అవతల స్కూలు బస్సు వచ్చేస్తుంది. అందుకే ఈ శాల్తీకి చెప్పాను,'' అంది ఉష.

''రోజు మొత్తం మీద ఒక్క అరగంటైనా ఎక్సర్‌సైజ్ చెయ్యకపోతే నా ఒళ్లు నా మాట వినదు. అందుకే నాన్నగారికి చెప్పాను. అయినా పొద్దున్నే పేపరంతా కంఠస్థం పట్టాలా?'' అన్నాడు రవితేజ.

''అవున్లే... మిషను మీద నడిస్తేనే వ్యాయామం చేసినట్లు. నేలమీద నడవడం నామోషీ,'' అన్నాడు రామ్మూర్తి.

‘‘మళ్లీ మొదలెట్టారా మీ ఫైటింగూ?’’ అన్నాడు ఆదిత్య పాలు తాగుతూ.

‘‘నువ్వు నోరుముయ్యరా కుర్రకుంకా!’’ అన్నాడు రామ్మూర్తి.

‘‘వాడినెందుకు అనడం. వాడేమన్నాడనీ! వున్న మాటేగా! అయినా మీ వ్యవహారం ఏమీ బాగాలేదు. మరీ పులీ మేకాలాగా వుంది మీ గొడవ,’’ అంది సుమిత్ర మనవడిని వెనకేసుకొస్తూ. ఆవిడ మాట నిజమే.

ఆ తండ్రీ కొడుకులకి క్షణం కూడా పడదు. ప్రతి విషయం లోనూ వాదులాడుకుంటూ వుంటారు. మళ్లీ ఒకరితో ఒకరు డైరెక్ట్‌గా మాట్లాడుకోరు. ఓ మనిషిని అడ్డం పెట్టుకుని వాదించుకుంటారు. సామాన్యంగా వాళ్లిద్దరికీ వారధి సుమిత్రే.

డైనింగ్ టేబుల్ దగ్గరికి చేరతారు టిఫిన్ చెయ్యడానికి. ‘‘నాకు దోసె వద్దు, నూనె ఎక్కువుంటుంది. కార్న్‌ఫ్లేక్స్ తింటానమ్మా,’’ అంటాడు రవి.

‘‘ఇవే మరి తిక్క ఆలోచనలంటే. కమ్మగా దోసె, కొబ్బరి చట్నీ వేసుకుని తినక తెల్లదొరల్లాగా ఆ పిచ్చివన్నీ తినడం ఏమిటో కదా సుమిత్రా,’’ అంటాడాయన.

‘‘ఏం చేస్తాం? గతంలోలా ఒకసారి గవర్నమెంటు ఉద్యోగంలో చేరి నిశ్చింతగా కూర్చునే రోజులు కావుగా ఇవి! మా ఆఫీసులో ఏడాదికోసారి వైద్యపరీక్షలుంటాయి. అందులో ఏదైనా తేడా వస్తే ఇంటికి పొమ్మంటారు. అందుకే ఈ తంటాలు. లేకపోతే నేనూ దోసెలూ, పూరీలు, గారెలూ లాగించేసేవాడినే అమ్మా!’’ అంటాడు కొడుకు.

‘‘వారమంతా ఈ గడ్డీగాదం తిని వారాంతంలో అంగుళం మందాన చీజ్ వేసిన పిజ్జా, ఓ ఐస్‌క్రీమ్ ఇటికా తెచ్చుకుని లాగించేస్తే కొలెస్టరాలు అదుపులో వుంటుందా సుమిత్రా?’’ అంటాడు తండ్రి.

నెల మొదట్లో వుంటుంది వాళ్ల తమాషా. కంప్యూటరు ముందు కూర్చుని, వచ్చిన జీతం, కట్టాల్సిన బిల్లులూ, ఖర్చులూ లెక్క వేసుకొని డీలాపడిపోతాడు రవి.

‘‘ఏమిటో! గతంలో అయితే చక్కగా నెల జీతంతో ఇల్లు గడిచిపోయేది. ఇంకా మిగిలేది. రిటైరయ్యాక కూడా రాజుగారి భరణంలాగా పెన్షను కూడానూ. అదృష్టం అంటే అదీ. ఏ టెన్షనూ వుండేది కాదు కదా అమ్మా,’’ అంటాడు రవి.

‘‘క్రెడిట్ కార్డు జేబులో వుంది కదా అని పిచ్చి ఖర్చులన్నీ పెట్టేసి ఆఖర్న ఏడిస్తే ఏం లాభం? మా రోజుల్లో ఇలా కార్డుల మీద ఖర్చు పెట్టుకోడమూ లేదు. వాడికి డబ్బు కట్టేటప్పుడు ఇలా మొత్తుకోవడమూ లేదు. అందుకే సుఖంగా వున్నాం. కదూ సుమిత్రా!’’ అంటాడు రామ్మూర్తి.

రుసరుసలాడుతూ కంప్యూటర్లో జమాఖర్చులు చేసేస్తూ వుంటే, మళ్లీ ఆయనే, ‘‘సుమిత్రా! ఎవరికైనా ఏదైనా అవసరం వుంటే నా దగ్గర డబ్బు తీసుకోవచ్చు. ఎంత కావాలో చెప్తే చెక్ రాసిస్తా. ఇందులో నామోషీ ఏంలేదు. తండ్రి దగ్గర తీసుకోవచ్చు,’’ అంటాడు.

‘‘ఇప్పుడంత అవసరం లేదులే అమ్మా. ఊరికే ఖర్చులు చూసి అనుకున్నా అంతే,’’ అంటాడు రవి.

రవి ఆఫీసుకి వెళ్లేటపుడు హాల్లో కూర్చుని, ‘‘అన్నీ తీసుకున్నాడేమో కనుక్కో. పర్సు, సెల్‌ఫోను తీసుకొన్నాడేమో అడుగు. కార్లో పెట్రోలుందేమో చూసుకోమను,’’ అంటాడు భార్యతో.

‘‘అమ్మా! ఇవన్నీ రోజూ చెప్పాలా? నేనేమైనా స్కూలుకెళ్లే పిల్లాడినా?’’ అని విసుక్కుంటాడు రవి.

‘‘ఏమోలే. వూరికే గుర్తు చేస్తున్నా నోరు వూరుకోక. క్రిందటి వారం మెళ్లో పుస్తె (ఐ.డి. కార్డు) మర్చిపోయి ఆఫీసుదాకా వెళ్లి మళ్లీ వెనక్కొచ్చింది ఈ మహానుభావుడే కదూ!’’ అని దెప్పి పొడుస్తాడాయన.

ఒక్కోరోజు మాత్రం తండ్రీకొడుకూ కూర్చుని క్రికెట్ గురించీ, రాజకీయాల గురించి ఓ పావుగంట ప్రశాంతంగా మాట్లాడుకుంటారు. కానీ అది చాలా అరుదు.

ఒక్కోసారి చాలా సీరియస్‌గా వాదించుకుంటారు.

వెంటనే పేపరు తిరగేసి, ‘‘సుమిత్రా అక్కడెక్కడో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఇళ్లు కట్టారుట. కొంత డబ్బిస్తే రూమ్ ఇస్తారుట. తర్వాత నెలనెలా ఇంత అని కడితే తిండీ తీర్థం మందూ మాకూ అన్నీ వాళ్లే చూసుకుంటారుట. మనం అక్కడికి వెళ్లటం ఉత్తమం ఏమో అనిపిస్తోంది,’’ అంటాడు.

రవి కూడా, ‘‘ఉషా, మనం వేరే ఇల్లు అద్దెకి తీసుకుని వెళ్లిపోదాం! పెద్దవాళ్లు వెళ్లడం ఎందుకూ? మనం కావాలనుకుంటే ఇంకో నాలుగేళ్లల్లో ఇంకో ఇల్లు కొనుక్కోగలం,’’ అంటాడు.

ఒకరోజు చాలా పెద్ద గొడవ జరిగింది, తండ్రీ కొడుకుల మధ్య. ఆవేళ శనివారం. రవికి శలవు. ఇంట్లోనే వున్నాడు.

రామ్మూర్తి మధ్యాహ్నం టీవీలో ఏదో తెలుగు సినిమా చూస్తున్నాడు. "ఛ, వెధవ సినిమా. ఇంట్లో ఫ్రీగా చూస్తుంటేనే విసుగొస్తోంది. ఇంక థియేటర్‌కి వెళ్లి చూసేవాళ్లు గుండె బాదు కుని ఏడవరూ! ఆ హీరో చూడు, చీకేసిన తాటిటెంకలా మొహమూ వాడూనూ. ఇక ఆ హీరోయిను బట్టలు కాశీలో వదిలేసి వచ్చినట్టుంది," అని ఒకటే సణుగుడు.

వింటున్న రవికి విసుగొచ్చింది. "అంత తిట్టుకుంటూ ఎందుకు చూడ్డం? ఛానల్ మార్చరాదా! లేకపోతే టీవీ తీసేసి అలా ఎటన్నా వెళ్లచ్చుగా," అన్నాడు.

దాంతో ఆయనకి కోపం వచ్చేసింది. "ఏం నా కొంపలో సణుక్కునే అధికారం కూడా లేదా నాకు?" అన్నాడు భార్యని పిలిచి.

"సినిమా చూస్తూ రన్నింగ్ కామెంట్రీ చేస్తుంటే వినేవాళ్లకు తలనొప్పి రాదా అమ్మా!" అన్నాడు రవి.

మాటామాటా పెరిగింది. "ఈ కొంపలో నేనుండలేను. వేరే దారి చూసుకుంటాను," అన్నాడు రామ్మూర్తి భార్యతో.

"వాళ్లెందుకు వెళ్లడం, మనమే పోదాం ఉషా," అన్నాడు రవి.

రామ్మూర్తి పేపరు తీసి, సీనియర్ సిటిజన్స్ హోమ్ కోసం వెతికి వాళ్లందరికీ ఫోన్లు చేశాడు. రవి కంప్యూటర్ ముందు కూర్చుని తన ఆఫీసుకి దగ్గరగా వున్న అద్దె ఇళ్ల వివరాలు వెతికి వాళ్లతో ఛాటింగ్ చేశాడు.

ఆ రాత్రి రామ్మూర్తికి కాస్త నలత చేసింది. వాళ్లు కిందనున్న బెడ్‌రూమ్‌లో పడుకుంటారు. పైన మూడు బెడ్ రూములున్నాయి. ఒకదాంట్లో రవి, రెండో దాన్లో ఆదిత్య వుంటారు. మాటిమాటికీ మెట్లెక్కి వెళ్లటం కష్టం కాబట్టి రిమోట్‌తో పనిచేసే బెల్ ఒకటి పెట్టుకున్నారు.

రామ్మూర్తి ఆయసపడుతూ వుంటే గుండెకి అమృతాంజనం రాసి, పంచదార నీళ్లు ఇచ్చి చూసింది సుమిత్ర. తగ్గకపోవడంతో బెల్ నొక్కింది.

పరుగున వచ్చేశారు రవి, ఉష. తండ్రిని చూసి, గాభరపడ్డాడు రవి. పైకెళ్లి బట్టలు మార్చుకుని, పర్స్ తీసుకుని వచ్చేశాడు. తండ్రిని, తల్లిని కార్లో ఇంటి దగ్గరున్న హాస్పిటల్‌కి తీసుకు వెళ్లాడు.

పక్కింటావిడని లేపి ఆదిత్యకి సాయంగా పడుకోమని అప్పగించి హాస్పిటల్‌కి వెళ్లింది ఉష. రామ్మూర్తిని ఎడ్మిట్ చేసుకుని ఉపశమనానికి మందులిచ్చారు. ఆయన దగ్గర ఒక్కరు మాత్రం వుండొచ్చు అంటే సుమిత్ర కూర్చుంది.

రవి, ఉష బయట కూర్చున్నారు. ‘‘ఏవిటో మొండిమనిషి. తన పట్టుదల తప్పించి ఎదుటివారి మాట వినిపించుకోరు. ఎంతసేపూ ఇతరుల గురించి ఆరాటం తప్ప తన గురించి ఆలోచించుకోరు. ఆయనేనా! నాకు మాత్రం వుండదా ఆయన మీద అభిమానం. మంచి బ్రాండెడ్ షర్టు కొనుక్కొచ్చి వేసుకోమంటే వేసుకోరు. నాకెందుకురా ఇవన్నీ, నువ్వు వేసుకో అంటారు. మంచి బూట్లు కొన్నా, మంచి వాచీ కొన్నా అంతే. కొత్తది నువ్వు వాడుకో. నువ్వు వాడుతున్న పాతది నాకిచ్చెయ్ అంటారు. విసుగొచ్చేస్తోంది నాకు,’’ అని ఆవేశంగా మాటాడుతున్నాడు రవి.

లోపల రామ్మూర్తీ అంతే. ‘‘ఇన్నేళ్లొచ్చినా ఇంకా చిన్నతనం లక్షణాలు పోలేదు. ఈకాలం పిల్లలకున్న తెగింపు లేదు. ఎంత సేపూ అమ్మా అమ్మా అంటూ నీవెంట తిరుగుతాడు. నా మీద అభిమానంతో అమెరికా పోకుండా ఇక్కడే వుండిపోయాడు. నేను వాడి కోసం సంపాదించింది ఏమీలేదు. ఎప్పుడో కొని పడేశాను ఈ స్థలం. ఇంటి కోసం తనే లోన్ తీసుకున్నాడు. వెర్రి సన్నాసి. తీసుకోగానే సరా! తీర్చుకోవద్దూ,’’ అని మాట్లాడుతుంటే, ‘‘వూరుకోండి, మీరు హైరానా పడకండి,’’ అంటోంది సుమిత్ర.

మర్నాడు ఆదివారం రామ్మూర్తికి అన్ని టెస్ట్‌లూ చేస్తామన్నారు డాక్టర్లు. అప్పుడే ఆయన సెల్‌ఫోన్‌కి ఫోనొచ్చింది సీనియర్ సిటిజన్స్ హోమ్ నుండి. చూడ్డానికి వస్తామన్నారు కదా, వెహికిల్ పంపించమా అని అడిగారు. ప్రస్తుతానికి ఆ ఆలోచన మార్చుకొన్నాం అన్నాడు రవి. అలాగా అని బాధపడిపోయి, మళ్లీ మనసు మార్చుకుంటే మాకు తెలియజెయ్యండి అన్నారు వాళ్లు.

రవికి కూడా చాలా మెయిల్స్ వచ్చాయి, అద్దె ఇంటి సమాచారంతో. అందరికీ ఇప్పుడొద్దు అనే సమాధానం ఇచ్చాడు.

రామ్మూర్తిగారికి టెస్ట్‌లు అన్నీ అయ్యాయి. ఏమీ తేడా లేదు. అంతా సవ్యంగా వుంది. అప్పుడేదో కారణం వల్ల ఆయాసం వచ్చింది, అంతే అని ఇంటికి పంపించేశారు.

ఆరోజు సోమవారం. రవి తీరిగ్గా కూర్చుని వున్నాడు. ‘‘సుమిత్రా! ఏం ఆఫీసు లేదా? వెళ్లడా?’’ అన్నాడు రామ్మూర్తి.

‘‘మీకు ఒంట్లో బాగాలేదు కదా! అందుకే రెండ్రోజులు శలవు పెట్టాడు,’’ అందావిడ.

‘‘నాకేమైంది? దుక్కపిక్కలా వున్నాను. వెళ్లమను. మళ్లీ అక్కడ పన్లన్నీ పేరుకుపోతాయి,’’ అన్నాడు.

‘‘అంత కొంపలంటుకుపోయే పన్లేం లేవు. శలవులు కూడా మిగిలిపోయాయి,’’ అన్నాడు రవి.

‘‘శలవులుంటే భార్యాభర్తా, పిల్లవాడిని తీసుకుని ఏ ఊరికో వెళ్లచ్చు. అప్పుడు వాడుకోవచ్చు ఆ శలవులు. ఇప్పుడు ఆఫీసుకెళ్తే బాగానే వుంటుంది. ఆ మాటే చెప్పు ఆయనగారికి,’’ సలహా ఇచ్చాడు రామ్మూర్తి.

‘‘ప్రపంచంలో అంతా నా మాట వినాలి, నేను మాత్రం ఎవరి మాటా వినను అంటే ఎలా కుదురుతుంది చెప్పమ్మా?’’ అన్నాడు రవి.

ఇద్దరూ ఆవిడని తడికలా అడ్డం పెట్టుకుని వాదులాడు కున్నారు.

‘భగవంతుడా వీళ్లిద్దరూ ఇక ఈ జన్మకి మారరు,’ అనుకుంటూ లోపలికెళ్లిపోయింది సుమిత్ర.

నిజమే మారరు. కారణం వాళ్లిద్దరూ భారతీయులు. భారత దేశంలో పుట్టిన వాళ్లకి ఆత్మాభిమానాలు, సెంటిమెంట్సూ కూడా ఎక్కువే.

❖❖❖❖❖



WESTMEAD
DOCTORS



Shop 6, Coles Complex
29-33 Darcy Road
WESTMEAD

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

GENERAL PRACTICE

Telugu and Hindi speaking
Female GPs
Male GPs

ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

ONSITE PATHOLOGY

# చిన్నచూపు

శ్రీ రాచకొండ మల్లికార్జున రావు, సిడ్నీ

ఎండ నడి నెత్తికి ఎక్కింది.

“పాత పేపర్లు కొంటాం,   పాత పుస్తకాలు కొంటాం” అంటూ తన తోపుడు బండి నెట్టుకుంటూ కేక వేస్తోంది సూరమ్మ.

సూరమ్మ 28 సంవత్సరాల యువతి. ఆరు నెలల గర్భిణి. తన భర్త ఆటో నడుపుతాడు. చిన్న తరగతి కుటుంబం మూలాన భర్తకు ఆసరాగా ఉంటుందని పాత పేపర్ల వ్యాపారం చేస్తోంది.

అది వేసవి కాలం. మధ్యాహ్నం 12 గంటలు కావస్తోంది.  గర్భిణి కావడంతో పేపర్లతో నిండిన బండిని ఆయాసంగా తోస్తోంది. ఇంటికి వెళ్ళే ముందు ఈ ఆఖరు వీధి తిరిగుదామనుకొని  కేక వేస్తూ నడుస్తోంది.

“పేపర్ అమ్మాయ్! ఇలా రా!” అంటూ మాట వినిపించింది. పక్క సందు మధ్యలో ఒక  గుమ్మం ముందు నిలుచుని ఒకావిడ పిలుస్తోంది.

“వస్తున్నానమ్మా” అంటూ సందువైపు బండి తిప్పింది సూరమ్మ. ఆ సందులో స్కూటర్లు సైకిళ్ళూ రెండు పక్కలా నిలిపి ఉన్నాయి. బండి పట్టదని దాన్ని సందు మొగలో వదిలి, ఒక గోనె సంచీ, తక్కెడ తీసుకుని నడిచివెళ్ళింది సూరమ్మ.

ఆవిడ పాత పత్రికలు, పుస్తకాల కట్టలు చూపిఉంచింది. బేరం ఆడుకుని తూకం వేసి డబ్బు అందించి వాటిని తన గోనె సంచీలోకి ఎత్తుకుంది. ఆమె వెడుతుండగా “పాత అట్ట పెట్టెలు ఉన్నాయి. కొంటావా?“ అని అడిగిందామె. “కొంటానమ్మా” అంది సూరమ్మ. “ఐతే ఉండు తీసుకు వస్తాను” అందావిడ. “ఈ లోగా నేను ఈ సంచీ బండిలో పడేసి వస్తానమ్మగారు” అంటూ గోనె సంచీ మూటను భుజాన్న వేసుకుని వెళ్ళింది సూరమ్మ బండి దగ్గరకి.

ఈ లోగా ఆవిడ టేబుల్ కింద పడున్న అట్ట పెట్టెల కట్ట తీసుకు వచ్చింది. సూరమ్మ రాకముందే  గుమ్మం పక్కన పడున్న ఒక నాపరాయి ముక్కని కట్ట మధ్యలోకి కనపడకుండా దోపేసింది.

సూరమ్మ మరొక ఖాళీ సంచీతో వచ్చింది. తూకం వేసుకును బేరమాడి ఒప్పుకున్న డబ్బు చెల్లించింది. మూట భుజాన వేసుకును బండి వైపు నడవసాగింది.

ఈ లోగా ఒక యువకుడు మంచి పాంటూ, షర్టు వేసుకుని ఎదురొచ్చాడు. ఇరుకు సందు మూలంగా సూరమ్మ సంచీ అతని షర్ట్ కి తాకింది. కోపంగా రుస రుసలాడుతూ చూశాడు. సూరమ్మ పట్టించుకోకుండా నడిచింది.

బండిలో అట్ట పెట్టెల మూట సర్ది పెడుతుంటే దాంట్లోంచి నాపరాయి ముక్క జారి కింద పడింది. “ఆమెను నమ్మి చూసుకోకుండా మూటకెత్తుకున్నాను. ఈ రాయి మూలంగా ఒక కిలో డబ్బు ఊరికే పోయింది”

అనుకుంటోంది సూరమ్మ. "ఇంకెన్ని రాళ్ళు మూట కట్టిందో ఆ మహాతల్లి చూద్దాం!" అని కట్ట విప్పింది సూరమ్మ.  అందులో ఒక చిన్న ఎర్ర డబ్బా రంగుకాగితం, రిబ్బన్ కట్టి కనిపించింది.

సూరమ్మ ఆవిడ ఇంటికి మళ్ళీ వెళ్ళి తలుపు కొట్టింది. "అమ్మగారు, ఇది కట్టలో కనబడింది. ఏదో పనికొచ్చేదేమోనని తీసుకు వచ్చా. చూడండి" అని ఎర్ర డబ్బాను ఆమెకు చూపించింది. ఆమె వెనకనే ఇందాకా తనపై రుసరుసలాడినాయన దాన్ని చూసి "ఇది నీకు ఎక్కడిది?" అని అడిగాడు ఆశ్చర్యంగా. "ఇప్పుడే అమ్మగారు పాత అట్ట పెట్టెలు అమ్మేరు. అందులో దొరికింది సార్" అని చెప్పింది సూరమ్మ.  ఆయన టేబుల్ కిందకు తిరిగి చూస్తే అక్కడ అట్ట పెట్టెలు మూట లేదు. ఆ రోజు వాళ్ళ anniversary. భార్యను surprise చేద్దామని ఆ ముందు రోజే ఒక బంగారు గొలుసుకొని దాన్ని ఆ మూటలో భద్రంగా దాచాడు. సూరమ్మ చేతిలోంచి ఎర్ర డబ్బాను ఆత్రంగా అందుకున్నాడాయన "బతుకు జీవుడా" అన్న భావనతో తో.

"ఇది కూడా ఆ కట్ట లోనే దొరికింది అమ్మగారు" అని ఆమె చేతికి నాపరాయిని అందించిది సూరమ్మ.

❖❖❖❖❖




❖❖❖❖❖

# తల్లిప్రకృతి

శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



'స్వరయుక్తంగా చదవకపోతే సంధ్యావందనం చేసిన ఫలితం లభించదు కాళీ!'

'అలాగే నాన్నగారూ! మీరు పలుకుతున్నట్లుగానే జాగ్రత్తగా పలుకుతూ నేర్చుకుంటాను.'

'సంధ్యావందనం పుస్తకాలలో కూడా కొన్ని అక్షరాలకు కింద, కొన్ని అక్షరాలకు పైన గీతలుంటాయి. కింద గీతలున్న అక్షరాలని కింద స్థాయిలో పలకాలి. పైన గీతలున్న అక్షరాలని పైస్థాయిలో పలకాలి. కొన్ని అక్షరాలకి పైన రెండు గీతలుంటాయి. వాటిని రాగయుక్తంగా పలకాలి.'

'అర్థమయింది నాన్నగారూ!.'

కాళీవరప్రసాదశర్మ లక్ష్మీనరసింహశర్మగారి ఏకైక పుత్రుడు. లక్ష్మీనరసింహశర్మగారు చాలా నిష్ఠాపరుడు. రోజూ తెల్లవారుజామునే లేచి సంధ్య వార్చుకుని, దేవతార్చన గావించుకుని అప్పుడు కాఫీ తాగుతాడు. తన కుమారుడైన కాళీని కూడా తన అడుగుజాడలలోనే నడిచేలా అతడికి శిక్షణ ఇచ్చుకుంటున్నాడు. కాళీకి కూడా తన తండ్రిగారికున్న భక్తి, మంచి అలవాట్లు బాగానే అబ్బాయి.

శర్మగారికి మారుతున్న దేశకాల పరిస్థితులని చూస్తుంటే చాలా బాధ కలుగుతూ వుంటుంది. తను రోజూ చెప్పుకునే సంకల్పంలో కలియుగే, ప్రథమపాదే అని చెప్పుకుంటూ వుంటాడు. అంటే ఇది కలియుగపు మొదటి పాదమేనన్న మాట. ప్రథమపాదంలోనే ఇన్ని ఘోరాలు జరుగుతుంటే, పరిస్థితులు ఇంత అల్లకల్లోలంగా వుంటే ఇంక నాలుగవ పాదం వచ్చేసరికి ప్రపంచం ఏ పరిస్థితిలో వుంటుందో కదా అనిపిస్తూ వుంటుంది అతడికి.

కాళీ చదువులో కూడా చాలా చురుకైన వాడు. ఎప్పుడూ క్లాసుఫస్ట్ వస్తాడు. అతడంటే టీచర్లందరికీ చాలా ఇష్టం. కాళీకి చదువుతో పాటు ఆధ్యాత్మిక విషయాలమీద కూడా చాలా ఆసక్తి ఎక్కువ. ఒక్కొక్కసారి అతడికి చాలా విచిత్రమైన సందేహాలు వస్తూ వుంటాయి. ఐనా సిగ్గుపడకుండా తన తండ్రినడిగి తీర్చుకుంటూవుంటాడు.

' నాన్నగారూ! మన పురాణాలన్నీ అభ్యంతరకరంగా నాకు కనిపిస్తున్నాయండీ.' అన్నాడు కాళీ ఒకరోజు తనతండ్రితో.

శర్మగారు చిరునవ్వు నవ్వి అడిగారు, ' ఎందుచేత?

శ్రీకృష్ణుడు అందరికీ మార్గదర్శకమైన గీతను బోధించాడు. బాగుంది. కాని కృష్ణుడి ప్రవర్తన ఎటువంటిది? చిన్నప్పుడే, గోపికలు స్నానాలు చేస్తుంటే వారి చీరలు తీసి దాచేసి ఏడిపించాడు. స్త్రీలను గౌరవంగా చూడాలని కదా హిందూమతం బోధిస్తున్నది? స్త్రీలమీద అత్యాచారాలు పెరిగిపోతున్నాయనే కదా, ఇప్పుడు అందరూ గగ్గోలు పెడుతున్నది? మరి ద్వాపరయుగంలోనే శ్రీకృష్ణుడంతటి వాడు స్త్రీలను అల్లా అల్లరి పెట్టడం ఎంతవరకు సమంజసం నాన్నగారూ?'

' లౌకికపరమైన దృష్టితో ఆలోచిస్తే నీ వాదన సమంజసంగానే తోస్తుంది. కాని అలౌకికంగా యోచిస్తే అందులోని పరమార్ధం బోధపడుతుంది. ఇక్కడ కృష్ణుడికి, గోపికలకు మధ్య వున్నది స్త్రీ పురుష సంబంధం కాదు. పరమాత్మకు, జీవాత్మకు వున్న అనుబంధం. శ్రీకృష్ణపరమాత్మ గీతలో అహాన్ని విడిచిపెట్టమని పదేపదే ఉద్బోధించాడు. అహం అంటే ఏమిటి? నేను, నాది అనే మమకారం. ఈ శరీరం నాది, ఈ భార్యాపిల్లలు నావాళ్ళు, నేను సంపాదించుకుంటున్న ఈ ఆస్తిపాస్తులన్నీ కేవలం నావి. ఈ సంపాదించుకునే ధనమంతా నేను, నా పిల్లలు సుఖభోగాలనుభవించడానికి.
అనేటటువంటి ఈ తాపత్రయాల వలన మనిషి పరానికి దూరమవుతున్నాడు. తామరాకు మీద నీటిబిందువులా జీవించాలని భగవంతుడు సెలవిచ్చాడు. నువ్వు చెప్పిన దాంట్లో కూడా అదే పరమార్ధం వుంది. గోపికలు అంటే జీవాత్మలు. వారు శరీరం మీద మమకారాన్ని వదులుకుని, ' అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ.' అని చేతులెత్తి మ్రొక్కుతూ కైవల్యాన్ని పొందారు.'

' చాలా బాగా వివరించారు నాన్నగారూ. మీరు చెప్పింది సబబుగానే వుంది. ఐతే శ్రీకృష్ణుడు పరమాత్మ కనుక మనం అలౌకికంగా ఆలోచించవచ్చు. కాని పరాశరుడు ఒక మామూలు మనిషి. తపస్సు చేసుకుంటున్న ముని. మరి ఆయన నదిని దాటుతూ, పడవ నడుపుతున్న ఒక పల్లెవనితను కామించడం ఎంతవరకు సమంజసం?'

' మంచిప్రశ్న వేసావు కాళీ. ఐతే ఒక్కవిషయం. పరాశరుడు అంతకు ముందు కాని, ఆ తర్వాత కాని స్త్రీలతో తిరిగిన దాఖలాలు లేవు కదూ? దానికి కారణం ఏమిటంటే, పరాశరుడు గొప్పతపస్సంపన్నుడు. త్రికాలజ్ఞాని. గ్రహాలన్నీ సరైన రాశులలో వుండి, కొన్ని గ్రహాలు ఉచ్చదశలో వున్న ఘడియలలో జన్మించిన శిశువు లోకోత్తరుడవుతాడు. ఆయన పడవలో వెళ్తున్న సమయం అత్యంత మహత్తరమైనది. ఆ ఘడియలలో గర్భాన్ని దరించిన స్త్రీకి పుట్టే శిశువు లోకకళ్యాణకారకుడవుతాడు. అందువలన పరాశరుడు సత్యవతికి ఆమె కన్యాత్వం చెడకుండా వరమిచ్చి ఆమెను గర్భవతిని చేసాడు. వారికి జన్మించిన వేదవ్యాసుడి గురించి అందరకు తెలిసున్నదే కదా?'
' వాస్తవాలు తెలియక కొంతమంది మన పురాణాలను హేళన చేస్తున్నారు నాన్నగారూ. మీ వివరణతో నా సందేహాలన్నీ తీరిపోయాయి. ఇలా అడిగినందుకు మాత్రం నన్ను క్షమించండి.'

శర్మగారు నవ్వి వూరుకున్నారు.

శర్మగారి భార్య పేరు కృష్ణవేణి. ఆమెను శర్మగారు ఆప్యాయంగా ' కృష్ణా!' అని పిలుచుకుంటూ వుంటారు. ఆవిడ మెట్రిక్యులేషను వరకూ చదువుకుంది. చిన్నప్పుడే రామాయణం, భారతం, భాగవతం లాంటి ఉద్గ్రంథాలన్నీ చదివేసింది. అంతే కాదు, ఆవిడకు సాహిత్యమంటే అమితమైన ఇష్టం. అందువల్ల అడవి బాపిరాజుగారు, విశ్వనాథ సత్యనారాయణగారు,

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు లాంటి మహానుభావులు, మాదిరెడ్డి సులోచనారాణిగారు, వాసిరెడ్డి సీతాదేవిగారు లాంటి మంచి రచయిత్రులు, రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు, మధురాంతకం రాజారాం గారు, బీనాదేవిగారు, చలంగారు వంటి గొప్ప రచయితలు వ్రాసిన పుస్తకాలన్నీ చిన్నతనంలోనే చదివేసింది. ఐతే ఆవిడకు ప్రాపంచిక విషయాలేవీ పట్టవు. ఎంతసేపూ భర్తకి, కొడుక్కి ఆప్యాయంగా అన్నీ వండి పెట్టడం, వారికి పూజ సమయానికి కావలసినవన్నీ అమర్చడం, తీరికసమయాలలో భగవద్గీత, రామాయణం, భాగవతం చదువుకోవడం, వీటితోనే ఆమెకు కాలక్షేపం అయిపోతూ వుంటుంది. వాళ్ళకి దేనికీ లోటు లేకపోయినా, ఇంట్లో మాత్రం టి.వి.లేదు. పాతకాలపు రేడియోలో భక్తిరంజని, వార్తలు, ఏవన్నా నాటకాలు, సంగీత కార్యక్రమాలు పెట్టుకుని కాలక్షేపం చేస్తూవుంటారు. ఇక కాళీ అయితే రేడియో దగ్గరకే వెళ్ళడు. ఎంతసేపూ చదువు మీదే ధ్యాస.

ఒకసారి కాళీ తండ్రిని అడిగాడు. ' నాన్నగారూ! నాకెప్పటినుంచో ఒక ధర్మసందేహం.'

'ఏమిటి నాయనా అది?'

' మనం సంధ్యావందనం చేసేటప్పుడు గాయత్రీమాతను ఉపాసిస్తాం కదా? కాని సూర్యనారాయణుడికి అర్ఘ్యం ఇవ్వడం దేనికి? అసలు సంధ్యావందనం అంటే సూర్యుడిని ఉపాసించడమా, లేక గాయత్రీమాతను ఉపాసించడమా? అసలు గాయత్రీమాత ఎవరు?

' నువ్వు చిన్నప్పుడు చదువుకున్న శ్లోకం ఏమిటి? నీవె తల్లివి, తండ్రివి, నీవే గురుడవు, నీవే సఖుడవు అంటూ కృష్ణుడిని స్తుతించావు కదా? కృష్ణుడు స్త్రీయా, పురుషుడా? కృష్ణుడిని మనం తల్లిగా భావించాలా, తండ్రిగా భావించాలా? అసలు భగవంతుడికి రూపం వుందా?'

'అర్థమైంది నాన్నగారూ.'

' అంతే కాదు, మనం సూర్యుడిని ఉపాసిస్తాం. గంగ, యమున,కావేరి, కృష్ణ మొదలైన పుణ్యనదులకి నమస్కరిస్తాం. పుష్కరస్నానాలు చేస్తాం. రావిచెట్టుకి, మర్రిచెట్టుకి, వేపచెట్టుకి కూడ నమస్కరిస్తాం. ఆవుని పూజిస్తాం. అగ్నిదేవుడిని పూజిస్తాం. హోమాలు చేస్తాం. పెళ్ళిలో కూడా హోమం లేకుండా ఏ కార్యక్రమం చెయ్యం. భూమాతకి నమస్కరిస్తాం. వాయుదేవుడిని ఆరాధిస్తాం. సంధ్యావందనం చెప్పుకునేటప్పుడు ఓం నమ: ప్రాచ్యై, దక్షిణాయై,ప్రతీచ్యై, ఉదీచ్యై, ఊర్ధ్వాయై, ధరాయై, అంతరాయై దిశే యాశ్చదేవతా ఏతస్యాం ప్రతివసంతేతాభ్యశ్చ నమ: అని అన్ని దిక్కులకి నమస్కరిస్తాం. ఆదిత్యాయ, సోమాయ, మంగళాయ, బుధాయచ, గురు, శుక్ర, శనిభ్యశ్చ, రాహవే కేతవే నమ: అని నవగ్రహాలని అర్చిస్తాం. మనం ప్రకృతిని ఆరాధిస్తాం. ఎందుకో తెలుసా? గాలి లేకపోతే అసలు మనిషి బ్రతకలేడు, చెట్లు బ్రతకవు. పైర్లు ఎదగవు. ఇక నీరు ప్రాణికి జీవాధారం. పొలాలకు నీరు లేకపోతే మనకు తిండే లేదు. మొక్కలు ఎదగడానికి, పైర్లు పెరగడానికి భూమి వుండి తీరాలి కదా? ఇక అగ్ని అవసరం ఎంత వుందో వేరే చెప్పాలా? అలాగే ఈ సమస్త భూమండలానికి వెలుగును పంచుతున్న మహానుభావుడు సూర్యుడు. ఇలా ప్రకృతిలోని ప్రతి అంశము మనకు దైవసమానమే. అసలు శ్రీకృష్ణపరమాత్మ గీతలో ఏమన్నాడు?

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని |
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ||

నిజమైన యోగి నన్ను సర్వజీవుల యందును మరియు సర్వజీవులను నా యందును గాంచును. ఆత్మదర్శియైన అట్టివాడు దేవదేవుడైన నన్నే నిక్కముగా సర్వత్రా గాంచును.

మనం తెల్లవారి లేస్తే ఐనదానికి, కానిదానికి లక్షసార్లు థాంక్సు, సారీలు చెప్పుకుంటూ వెళ్తాం కదా? అటువంటిది మనకి జీవనాధారమైన ప్రకృతికి, సూర్య చంద్రులకు, పంచభూతాలకు మనం కృతజ్ఞతలు చెప్పడంలో తప్పేమన్నా వుందా? వాటిని ఆరాధించడంలో అనౌచిత్యముందా? చెప్పరా కాళీ.'

కాళీ ఆలోచిస్తూ వుండిపోయాడు.

రోజులు గడుస్తున్నాయి. కాళీ ఒక్కొక్క క్లాసే దాటుకుంటూ ఇంజనీర్ అయ్యాడు. అతడి చదువు పూర్తికాగానే అతడికి మంచి విదేశీకంపెనీలో చాలా ఎక్కువ జీతం మీద ఉద్యోగం వచ్చింది. తలిదండ్రులు చాలా ఆనందించారు. తమ పూజలు ఫలించాయని పొంగిపోయారు. వారి కుటుంబానికున్న పేరు ప్రఖ్యాతులవల్ల, అతడి ఉద్యోగాన్ని చూసి కాళీకి అనేక పెళ్ళిసంబంధాలు రాసాగాయి. అనేకమంది లక్షలు, లక్షలు కట్నం ఇస్తామని సంప్రదించసాగారు. ఐతే, శర్మగారికి ధనాశ లేదు. మంచికుటుంబంలోంచి రూపసి, విద్యావతి, గుణవంతురాలు ఐన కావేరి అన్న అమ్మాయిని కోడలిగా తెచ్చుకున్నారు. కావేరి కూడా బి.టెక్. చేసింది. ఆమె కూడా మంచి ఉద్యోగంలో వుంది.

కోడలు ఇంటికొచ్చిన వేళావిశేషం, కాళీకి ప్రమోషను వచ్చి, మరింత ఎక్కువ జీతం మీద అతడి కంపెనీ వారు అతడిని అమెరికా పంపుతామన్నారు. అందరూ చాలా సంతోషించారు.

ఐతే కాళీ తలిదండ్రులని వదిలి వెళ్ళడానికి బెంగపడుతూంటే శర్మగారు అన్నారు, ' నాయనా! నేటి రోజుల్లో ఇవన్నీ సహజం. ఇదివరకు ఉన్నవూరు దాటి వెళ్ళాలంటే ఇబ్బంది పడేవారు. కాని ఇప్పుడు ప్రపంచమంతా ఒకటయిపోయింది. పైగా ఇదివరకు కాశికి వెళ్ళినవాడు, కాటికి వెళ్ళినవాడు ఒకటే అనేవారు. దానికి కారణం ప్రయాణాలు అంత ప్రమాదకరంగా వుండేవి. ఇప్పుడు ఇవాళ ఇక్కడ బయలుదేరితే, రేపటికల్లా అమెరికాలో వుంటున్నాం. అంతేకాదు. ప్రపంచంలోని ఏమూల నుంచయినా, మరే మూలకయినా ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ మాట్లాడుకోవచ్చును. శాస్త్రం ఇంత అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో ఎందుకురా, మాగురించి అంత బెంగపడతావు? చక్కగా ఇద్దరూ అమెరికా వెళ్ళి ప్రయోజకులనిపించుకోండి.'

కాళీ ఇంకే మాట్లాడలేకపోయాడు. కావేరిని తీసుకుని అమెరికా వెళిపోయాడు. అక్కడ అతడికి అన్నీ సదుపాయంగానే వున్నాయి. చక్కని వసతి దొరికింది. తన భార్యకు కూడా వెళ్ళిన నెలరోజుల్లోనే మంచి కంపెనీలో ఉద్యోగం దొరికింది. ఇద్దరూ చెరో కార్లోను ఆఫీసులకి వెళ్ళి వస్తూంటారు. ఇక అమెరికా అన్న మాటే కాని, అక్కడ దొరకని వస్తువంటూ లేదు. కావల్సినన్ని ఇండియన్ రెస్టారెంట్లు వున్నాయి. ఇండియన్ షాపులున్నాయి. ఆ షాపుల్లో చంద్రికా సబ్బునించి, అన్ని వస్తువులు చక్కగా దొరుకుతాయి.

వెళ్ళిన మొదట్లో రోజుకొకసారి కాళి, కావేరి తమ తలిదండ్రులతోను, అత్తమామలతోను స్కైప్ లో మాట్లాడుతూ వుండేవారు. తరవాత్తరవాత వారానికొక సారి మాట్లాడుతున్నారు. ఆ తరవాత అదీ తగ్గిపోయింది.

చూస్తూ, చూస్తూండగా రెండేళ్ళు గడిచిపోయాయి.

శర్మగారు కొడుకు గురించి ఆందోళన పడసాగారు. అక్కడి వాతావరణం కాశీలో ఏమైనా మార్పులు తీసుకువచ్చిందా? అతడికి ఏవైనా కొత్త అలవాట్లు వచ్చాయా? ఏదీ తెలియటల్లేదు. కాని కాశీ ఫోన్లు చెయ్యడం పూర్తిగా తగ్గించివేసాడు.

ఇక్కడ కృష్ణవేణి ఆరోగ్యం రోజురోజుకి క్షీణించసాగింది. డాక్టర్లు పరీక్షించి ఏ జబ్బూ లేదని బలానికి మందులు రాసిచ్చారు. కాని ఆమె ఆరోగ్యం మాత్రం బాగుపడటల్లేదు. శర్మగారు ఆమె గురించి కూడా ఆందోళన పడసాగారు. ఆమె పరిస్థితి చూసి, ఇంక భరించలేక ఒకరోజు శర్మగారు తన కొడుక్కి ఫోన్ చేసారు. ఆ సమయంలో కొడుకు అందుబాటులో లేడు. కోడలు అయిన కావేరి ఫోను తీసింది.

' అమ్మా, కావేరీ! ఎలా వున్నారు మీరిద్దరూ?'

' బాగున్నాం మామయ్యా. మీరెలా వున్నారు?'

' ఏమిటోనమ్మా. మీ అత్తయ్య ఆరోగ్యం అస్సలు బాగుండటం లేదు. డాక్టర్లనడిగితే జబ్బేం లేదు పొమ్మంటున్నారు. మీకు ఫోన్ చేసి చెబుతానంటే మీ అత్తయ్య ససేమిరా వద్దంది. చెబితే మీరిద్దరూ కంగారు పడి ఇక్కడికి పరిగెత్తుకు వచ్చేస్తారంది. దానివల్ల మీ కెరీర్లు పాడవుతాయంది. కాని మీ అత్తయ్య రోజురోజుకి చిక్కిపోతోందమ్మా. ఏంచెయ్యాలో అస్సలు పాలుపోవటల్లేదు. అందుకనే ఇంక ఉండబట్టలేక మీకు ఫోను చేస్తున్నానమ్మా.'

కావేరి అంది, ' కదా! సేమ్ టు సేమ్. మీ అబ్బాయి పరిస్థితి కూడా ఇక్కడ అలాగే వుంది మామయ్యా. నా బలవంతం మీద డాక్టరుకి చూపించుకున్నారు. ఆయన పరిస్థితి గురించి కూడా ఇక్కడి డాక్టర్లు అత్తయ్యగారి గురించి అక్కడి డాక్టర్లు చెప్పినట్లే చెప్పారు. మీకు ఫోన్ చెయ్యాలని ఎన్నిసార్లో అనుకున్నాను. కాని మీ అబ్బాయిగారు చెయ్యద్దని నాకు ఆంక్షలు పెట్టారు. మీతో చెబితే మీరు గాబరా పడతారు, అందుకని మీతో ఏమీ చెప్పద్దని అన్నారు మామయ్యా.'

శర్మగారు చాలా ఆందోళన పడ్డారు. ' ఏమిటమ్మా, నువ్వంటున్నది? మరి వాడి ఆరోగ్యం అలా వుంటే మాకు చెప్పద్దా? వాడు వద్దంటే మాత్రం నువ్వు మానేస్తావా?'

కావేరి నిస్పృహగా అంది, ' మరి మీరు కూడా అత్తయ్య వద్దన్నారని మాకు ఫోన్ చెయ్యలేదు కదా మామయ్యా.'

శర్మగారు మౌనంగా ఫోను పెట్టేసారు.

సుదీర్ఘంగా ఆలోచించి, కాగితం, కలం తీసుకుని కొడుక్కి ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టారు. ఎందుకంటే ఫోనులో మాట్లాడినా తన మనసులో వున్న భావాలనన్నిటినీ విపులంగా విశదీకరించడం సాధ్యపడదు. పైగా తను చెప్పదలుచుకున్నదానిని మధ్యలో తన కొడుకు ఖండించవచ్చును. అప్పుడు సమస్య పరిష్కారం కాకపోవచ్చును.

'నాయనా కాశీ, మీ ఇద్దర్నీ చిరాయురస్తని దీవించి మీ నాన్న వ్రాయునది. మీరిద్దరూ కులాసాగా వున్నారని తలుస్తాను. మీ నుంచి ఏదైనా శుభవార్త వస్తుందేమోనని నేను, మీ అమ్మ ఈ రెండేళ్ళుగా ఎంతో ఎదురు చూస్తున్నాము. కాని మీరసలు ఫోన్లు చెయ్యడమే మానేసారు. ఈ మధ్యని నేను మీ ఇద్దరి జాతకాలు మన పురోహితులవారైన పరమేశ్వరశాస్త్రిగారికి చూపించాను. ఆయన చాలా దీర్ఘంగా స్టడీ చేసి, ఒక విషయం చెప్పారు. మీ ఇద్దరికీ

సర్పదోషం వున్నదట. అందుకని మిమ్మల్నిద్దర్నీ శ్రీకాళహస్తి తీసుకువెళ్ళి అక్కడ పూజలు చేయిస్తే ఆ దోషం తొలగిపోయి మీకు సంతానం కలుగుతుందని నమ్మకంగా చెప్పారు. ఆయన మాటల మీద నాకు గురి కుదిరింది.

అంతేకాదు. మరొక ముఖ్యమైన విషయం కూడా వుంది. మీ అమ్మ ఆరోగ్యం ఏమీ బాగుండటం లేదు. రోజురోజుకీ చిక్కిపోతోంది. డాక్టర్లకి చూపించాను. ఆమెకు ఏ వ్యాధీ లేదని అంటున్నారు. ఒకవేళ మీ గురించి బెంగపెట్టుకుందేమో అని అడిగాను. ఏం లేదు, పొమ్మంటుంది. నాకేమీ పాలుపోవటల్లేదు. మీరు ఒకసారి ఇక్కడికి వస్తే మనందరం ఆలోచించుకుని ఆమెని మంచి డాక్టరుకి చూపిద్దాము.' నీవెప్పుడు వచ్చేదీ తెలియజేయి.'

ఇట్లు,

మీ నాన్న.

ఆ ఉత్తరం పోస్ట్ చేసాక శర్మగారికి కాస్త ఊరట లభించింది. ఇంక ఆ పైన దైవనిర్ణయం ఎలావుంటే అలా జరుగుతుంది అని అనుకున్నారు.

వారంరోజులు గడిచాయి. శర్మగారు హాల్లో కూర్చుని విష్ణుసహస్రనామ స్తోత్రపఠనం చేసుకుంటున్నారు. బైటనుంచి పోస్ట్ అన్న కేక విని ఆత్రంగా వెళ్ళారు. పోస్ట్‌మేన్ ఇచ్చిన ఉత్తరం చూసి ఆశ్చర్యం కలిగింది. అది తన కొడుకునించి వచ్చిన ఉత్తరం. అంటే ఇంచుమించు తను ఇక్కడ ఉత్తరం వ్రాస్తున్న ఘడియలలోనే, తన కుమారుడు కూడా అక్కడ తనకు ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టాడన్న మాట! అతడి ఉత్తరం తనకి అందిన ఈ సమయంలోనే అతడికి కూడా తన ఉత్తరం చేరుతుందేమో! సంభ్రమంగా ఉత్తరం తెరిచి చదవసాగాడు.

'నాన్నగారూ! నమస్కారం. నన్ను క్షమించండి. నేను కావేరితో కలిసి శాశ్వతంగా భారతదేశానికి తిరిగి వచ్చేస్తున్నాను. ఈ విషయంలో మీ సలహా అడగకుండా నా అంతట నేనే నిర్ణయం తీసుకున్నానని నామీద కోపగించుకోకండి.

నాన్నగారూ! నేను మీయొక్క, అమ్మయొక్క పెంపకంలో పెరిగిన బిడ్డని. మీరు నేర్పిన అలవాట్లు, ఆచారాలు, సంప్రదాయాలను వంటబట్టించుకున్న హిందువుని. నేను ఇక్కడ ఇమడలేను. నీరు వదిలి ఒడ్డున గిలగిల కొట్టుకుంటున్న చేపపిల్లలా వుంది ఇక్కడి నా పరిస్థితి.

నాన్నగారూ! ఇక్కడ కూడా నదులు వున్నాయి. గాలి వుంది. ఆకాశం వుంది. భూమి వుంది. అగ్ని వుంది. కాని ఇక్కడ పుణ్యనదులు లేవు నాన్నగారూ! ఇక్కడి నదులలో పుణ్యస్నానాలు ఆచరించడం వుండదు. ఇక్కడి నదులకు పుష్కరాలు వుండవు. స్నానం చేసేటప్పుడు ఇక్కడి ఆడువారు గంగమ్మకి పసుపు,కుంకాలు సమర్పించరు. ఇక్కడి నదులు కేవలం నీటికి ఆకరాలు మాత్రమే. 'గంగేచ, యమునేచ, గోదావరి, సింధు, కావేరి....జలేస్మిన్ సన్నిధిం కురు ' అనుకుంటూ ఇక్కడ ఎవరూ స్నానాలు చెయ్యరు.




ఇక్కడ కూడా రోజూ ఉదయం సూర్యుడు ఉదయిస్తాడు నాన్నగారూ! కాని ఇక్కడి సూర్యుడు జనం చేత సూర్యనమస్కారాలు అందుకోడు. అర్ఘ్యాలు అందుకోడు.

ఇక్కడ కూడా గాలి వుంది. కాని నాన్నగారూ, ప్రాణాయామం చేస్తూ, సూర్యనాడి, చంద్రనాడి అనుకుంటూ, ఇడ, పింగళ, సుషుమ్న అని భావించుకుంటూ వాయుదేవుడికి మహత్తుని ఎవరూ కల్పించరు.

ఇక్కడ కూడా అగ్ని వుంది నాన్నగారూ! కాని హోమాలు వుండవు. బార్బిక్యూలుంటాయి. అగ్నిదేవుడికి ఘృతం, హవిస్సు అర్పించడాలు వుండవు.

ఇక్కడ కూడా నేల వుంది నాన్నగారూ! కాని భూమాత లేదు.

మీకు గుర్తుందా నాన్నగారూ! చిన్నప్పుడు మీరు నాకు తల్లిప్రకృతి గురించి చాలా చక్కగా వివరించారు. మనం అన్నింటిలోను, అందరిలోను పరమాత్మను దర్శించుకుంటామని చాలా చక్కగా వివరించారు. కాని ఇక్కడ నాకు ఈ పంచభూతాలలో మన విష్ణువు, మన శివుడు, మన పార్వతి, మన గంగా, యమున, కావేరిలు, మన సాక్షీభూతుడైన, మాతలి నడుపుతూండగా, ఏడుగుర్రాలనెక్కి పయనించే సూర్యభగవానుడు, మన ఋషుల నుంచి హవిర్భాగాన్ని అందుకునే అగ్నిదేవుడు, వాయుదేవుడు వీళ్ళెవరూ నాకు కనపడటల్లేదు నాన్నగారు. నా దృష్టి సంకుచితమై పోయిందని మీరు భావించవచ్చు. కాని నాకు నా గంగమ్మ, నా కావేరి (మరి నా భార్య పేరు కూడా అదే కదా నాన్నగారూ?), నా కృష్ణవేణి తల్లి (మరి అమ్మ పేరు కూడా అదే కదా నాన్నగారూ?), నా భారతదేశపు గగనాన ఉదయించే శ్రీసూర్యనారాయణుడు వీళ్ళందరూ కావాలి. నేను వారందర్నీ వదిలి ఇక్కడికి వలస వచ్చి చాలా అశాంతితో జీవిస్తున్నాను. త్యాగయ్యలా నేను ఏరోజు భుక్తి ఆరోజు సంపాదించుకుంటాను. అంతకు మించి నాకు లక్షలు లక్షలు వద్దు. ఆ డబ్బు కల్పించే వ్యామోహమూ నాకు వద్దు. బిస్మిల్లాఖాన్‌గార్ని ఎవరో అమెరికా వచ్చి అక్కడ స్థిరపడిపోమని అడిగితే, వారు ' తప్పకుండా వస్తాను నాయనా! కాని నాతోపాటు ఈ గంగమ్మ తల్లిని కూడా నువ్వు అమెరికా తీసుకువెళ్ళగలవా? నేను రోజూ గంగాస్నానం చేస్తూవుంటాను నాయనా. అది నా అలవాటు.' అన్నారట. అలాగు నాకు నా పుణ్యనదులన్నీ కావాలి నాన్నగారూ.

నాకు ఉరుకులు, పరుగులతో కూడిన ఈ వ్యస్తజీవితం, ఈ సంపాదనకోసం వెంపర్లాట, ఇవేవీ వద్దు నాన్నగారూ. నాకు అమ్మ సన్నిధి, మీ సన్నిధి కావాలి. పొద్దున్న ప్రశాంతంగా దేవతార్చన చేసుకోగలగాలి. సాత్వికమైన భోజనం చాలు. నాకు ఇహభోగాలకి దూరంగా, పరానికి దగ్గరగా వుండాలని వుంది.

అందుకే నాన్నగారూ, మిమ్మల్ని అడగకుండా, మీ అనుమతి తీసుకోకుండా నేను భారతదేశానికి తిరిగి వచ్చేస్తున్నాను. నన్ను క్షమించి ప్రేమతో మీ అక్కున చేర్చుకుంటారు కదూ?


ఇట్లు,

మీ కుమారుడు, కాశీవరప్రసాద శర్మ.'

ఉత్తరం చదవడం ముగించిన శర్మగారు హర్షాతిరేకంతో పరుగు పరుగున లోపలికి వెళ్ళి, ప్రేమగా కృష్ణవేణితో అన్నారు, ' కృష్ణా, మన వంశాంకురం, మన పుత్రరత్నం, మన కాశీ అమెరికా వదిలి ఇక్కడికి వచ్చేస్తున్నాడే. ఇంక అబ్బాయి, కోడలు ఇక్కడే వుంటారట.'

ఈ మాటలు చెబుతున్నప్పుడు శర్మగారి కళ్ళనించి రెండు కన్నీటిబొట్లు కృష్ణవేణి చీరమీద పడి ఇంకిపోయాయి. ఆ మాటలు వింటున్న కృష్ణవేణి కన్నుల నించి రెండు కన్నీటిబొట్లు రాలి శర్మగారి పాదాలను తాకాయి.

అవి ఆనందోద్వేగంలో వారి కళ్ళనుంచి రాలిన ఆనందాశ్రువులని వేరే చెప్పాలా?



❖❖❖❖❖



**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

P: (02)88891383 | F: (02)86254326

# Bulk Billing

OPEN 7 DAYS

New Medical Centre at
## Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm

G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au

# దేవుడిని ఏమి కోరుకోవాలి

శ్రీమతి ఇమ్మడి రాజ సుకన్య, సిడ్నీ

సాంబుడు, రంగడు అనే ఇద్దరు మిత్రులు రోజు అడవికి వెళ్లి కట్టెలు కొట్టి తెచ్చే వాళ్ళు. ఒక రోజున పెద్ద పుట్ట మధ్యలో ఒక శివలింగం కనపడినది. ఆ శివలింగానికి పాములు చుట్టుకుని ఉన్నాయి. మొదట భయపడినా భక్తితో ఇద్దరూ నమస్కరించారు. వీళ్ళను చూసి పాములు పుట్టలోకి వెళ్ళిపోయాయి. వీళ్లకు భయం పోయింది. కొన్ని పువ్వులు తెచ్చి లింగానికి పూజ చేసి తమ దరిద్రం తీరాలని శివుని కోరుకున్నారు. ఆ తరువాత ఎండిన చెట్లు వెతుక్కుంటూ అడవి అంతా తిరిగారు ఒక చెట్టు దగ్గరికి వెళ్లేసరికి పైనుంచి ఒక కాకి నోట్లో నుంచి వజ్రాల హారం జారి పడింది. అది రాజులు ధరించే  హారం లాగ ఉండటంతో నేరుగా అది తీసుకొని రాజుగారి దగ్గరకు వెళ్లి హారాన్ని రాజు గారికి ఇచ్చారు. ఆ ఆ హారం రాజుగారి దేను. వేటకి వెళ్ళినప్పుడు జారి పడిపోయింది వాళ్ల నిజాయితీకి మెచ్చుకుని రాజుగారు చెరొక వంద వరహాలు ఇచ్చి పంపినారు. వాళ్ళు ఆనందంతో పొంగిపోయి ఇంటికి వెళ్లి వరహాలు భార్యలకు ఇచ్చినారు. ఆనందంతో కొత్త వస్త్రాలు, తినుబండారాలు పుష్కలంగా కొనుక్కుని ఆనందించారు. ఇక రోజు అడవికి వెళ్లి ఇంకా ఏమైనా నగలు, హారాలు దొరుకుతాయేమోనని వాళ్ల భార్యలు వాళ్లని వెతికి తెమ్మని వేధించసాగారు. మిత్రులు ఇద్దరు అడవికి వెళ్లి శివలింగం ఎదురుగా దీనంగా ప్రార్థించారు. మరి కొన్ని నగలు దొరికేలా చేయమని. శివలింగం మీద పాములు వచ్చి భయంకరంగా బుసలు కొట్టాయి. మిత్రులిద్దరు దిగులుగా కూర్చున్నారు. అటుగా వెళుతూ ఒక సాధువు వీళ్లను సమీపించి ఇలా అన్నాడు. శివుడు దేవతలకి దేవుడు. మీరు ఆయనను కోర వలసినది ప్రాపంచిక కోరికలు కాదు. మాయను జయించ వలెను. మాయ నుండి కాపాడమని కోరాలి అని హితబోధ చేసాడు. మిత్రులిద్దరూ అలాగే ప్రార్థించారు శివుని. కారణం ఏదైతేనేం వాళ్లకు జ్ఞానోదయం కలిగింది. వైరాగ్య భావన కలిగింది. తమ భార్యలకు కూడా విషయాన్ని వివరంగా తెలిపే వాళ్లకు కూడా బంధాల నుంచి విముక్తి కలిగించారు. మనమందరము కూడా అలాగే కోరుకునే మాయ నుండి విముక్తులమవుదాము.

❖❖❖❖❖

SoftLabs®
Demands Delivered
IT CONSULTING SERVICES COMPANY
TRAINING SERVICES
- SOFTWARE TESTING
- PRE SALES ANALYSIS
- BUSINESS ANALYSIS
- AGILE TRAINING
CONSULTING SERVICES
- CONTRACT MANAGEMENT
- PAYROLL MANAGEMENT
- RESOURCE MANAGEMENT
- STAFFING
CONTACT: SREENI PILLAMARRI P: 0410 756 040 | E :BUSINESS@SOFTLABS.COM.AU | W: WWW.SOFTLABS.COM.AU
SYDNEY | MELBOURNE | CANBERRA | ADELAIDE | BRISBANE | PERTH | TASMANIA

## అమెరి "కారు తోయుట, టోయించు కొనుట" కథ

శ్రీ వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

అది జపాను వాడి భాషలో తన దేశంలో తయారు చేసే కారుకి పెట్టుకున్న పేరే కానీ, తెలుగులోకి వచ్చే సరికి అంత చిన్న పేరూ భలే మారిపోతుంది. ఇదెలా తెలిసిందీ అంటే నేను మూడేళ్ళ క్రితం కాకినాడ వెళ్ళినప్పుడు పిఠాపురం రోడ్డు మీద ఓ కొత్త భవనం కనపడింది. అది ఇంకా పూర్తి ఆవ లేదు. పురోగమిస్తున్న ఆంధ్ర దేశంలో ఇనప తట్టలు నెట్టి మీద పెట్టుకుని ఇసక మోస్తున్న కూలీలు సెల్ ఫోన్లలో సినిమా పాటలు వింటూ పని చేసుకుంటున్నారు. ఆ భవనానికి పైన ఎక్కడో యాభై అడుగుల ఎత్తులో ఉన్న మూడు తెలుగు అక్షరాలతో ఉన్న ఒక చిన్న మాట నన్ను ఆకట్టుకుంది. కానీ అదేమిటో నాకు అర్ధం అవక మా కారు ఆపమని డ్రైవర్ కి చెప్పి లోపలికి వెళ్లి నీరసంగా ఉన్నట్టు ఉన్నా గొప్పగా ఉన్నట్టు కనపడడానికి టై కట్టుకుని నన్ను చూడగానే బిగుసుకు పోయి లేచి నుంచుని రమణా రెడ్డిలా రివటలా ఉన్న ఓ యువకుడిని "ఇది ఏ రకం కొట్టు నాయనా?" అని అడిగాను.

"కొట్టా" అని ఆ యువకుడు ఎంతో అహం దెబ్బతిన్న వాడిలా నా కేసి చూడగానే "అదే, ఇక్కడ ఏం అమ్ముతారూ?" అని నా అనుమానం విశదీకరించాను. కానీ అప్పటికే నాకు విషయం కాస్త అర్ధం అయింది. ఎందుకంటే రమణా రెడ్డి కూచున్న ఆ పెద్ద హాలులో....రెండు కార్లు .. అవును....లోపల హాలులోనే....అదీ ఇండియాలో పిఠాపురంలోనే...ఎంత హాచ్చెరం!..నిజం కార్లే ...నిగ నిగలాడుతూ మెరిసిపోతున్నాయి. చుట్టూ గోడల మీద ఓ మూడక్షరాల మాట తెలుగులో అక్కడక్కడా రాసి ఉంది. కానీ ఆ గెడ కర్ర కుర్రాడు టై సద్దుకోడం మానేసి నోరు పెగిలే లోపుగా ఇంగ్లీషులో టొయోటా అనే పేరు నాలుగైదు చోట్ల చూశాను. అంటే ఇది జపాన్ వారి టొయోటా కార్లు అమ్మే డీలర్ షిప్ అనమాట. మా చిన్నప్పుడు సరిగ్గా అదే చోట పిఠాపురం పశువుల సంత ఉండేది. దేశం పురోగమించింది.

ఇంతకీ నాకు అంత ఆసక్తి కలిగించిన ఆ జపాన్ ఇంగ్లీషు మాటకి తెలుగు అనువాదం "టోయుట". ఇంకో చోట "టయాట' అని కూడా స్వేచ్చానువాదం ఉంది. మరో చోట "తోయుట" అని చూడగానే... చెప్పొద్దూ.... నా గుండె డబ్ డబ్ అని రెండు సార్లు స్పెషల్ గా కొట్టుకుంది. ఒకటేమో టొయోటా అనే జపాన్ వాడి మాటకి అన్ని తెలుగు పదాలు సృష్టించుకుని తనలో కలిపేసుకునే తెలుగు భాష జీర్ణ శక్తికి మరో సారి ఆనందం వేసింది. ఇక 'తోయుట' అనే పదం చూడగానే నేను మానసికంగా అనేక పర్యాయాలు పరి పరి విధములుగా అమెరికారు టోయుట లేదా 'టోయించు కొనుట' గుర్తుకు తెచ్చుకొనుట జరిగి రెండో సారి డబ్ డబ్ కి కారణం. ఈ ఆసక్తి అంతటికీ కారణం ఆ బిల్డింగ్ కి పైన రాసి ఉన్న అక్షరాలు అక్షరాలా "తోయుట". పైగా దాని చుట్టూ లైట్లు వెలుగుతూ, ఆరిపోతూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అసలు వీరు ఏమి తోయుదురా, ఎలా తోయుదురా, ఎందుకు తోయుదురా, ఎవరు తోయుదురా వగైరా ప్రశ్నలకి సమాధానాలు రాబట్టుకోడానికే నేను ఆ 'కొట్లో' అడుగుపెట్టాను.

పాపం రమణా రెడ్డికి తెలియని పరమ రహస్యం ఏమిటంటే అసలు ఈ కారు తోయుట ప్రాక్టీసు నా చిన్నప్పుడు అక్కడికి పది కిలో మీటర్ల దూరంలోనే ఉన్న కాకినాడలోనే మొదలయింది. ఆ రోజుల్లో మొత్తం కాకినాడలో మహా అయితే పది కార్లు ఉండేవి. అందులో నా ప్రాక్టీసు 30 % కార్ల మీదే. అంటే అన్సారీ, మా క్రౌన్ టాకీస్ స్వామి నాయుడు, రామారావు పేటలో డా. సత్యవోలు శివరావు గారి కార్ల మీద. అన్సారీ కారు వంద గజాలు తోస్తే కానీ స్టార్ట్ అయ్యేది కాదు. స్వామి నాయుడు కారు యాభై గజాల తోపుడుకే పొగలు గక్కుతూ స్టార్ట్ అయేది కానీ ఆ తరవాత ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతుందో దాన్ని పుట్టించిన ఆ బ్రహ్మదేవుడి కూడా తెలీదు. ఓ సారి అది మూడు లైట్ల జంక్షన్ దగ్గర, స్వామి నాయుడు అమ్మాయిల కేసి చూస్తూ కారు ఓనరు గర్వంతో గుటకలేస్తూ ఉండగా అది ఓ పెద్ద చావు గురక పెట్టి ఆగిపోతే ఓ లారీ వాడు వాడి లారీని ఆప లేక వీడి కారుని గుద్దేసి, పైగా 'ఇలాటి ఎదవ కారేసుకుని రోడ్డెక్కు తారేటీ?" అని చెయ్యి చేసుకోబోయాడు. ఇదంతా చూస్తూ ఆ అమ్మాయిలు పరిగెట్టి పారిపోగానే "ఛ. దానెమ్మ" అని నాయుడు గాడు ఆ కారుని రెండు గోనె సంచీలలో వేసుకుని ఇంటికొచ్చేశాడు. ఆ పార్టులన్నీ స్టడీ చేసి ఇంజనీరింగ్ లో నేను ఆటోమొబైల్ పరీక్ష పాస్ అయిపోయాను. ఇక డా. సత్యవోలు శివరావు గారు వాళ్ళింట్లో బయలు దేరగానే అక్కడికి మూడు మైళ్ళ దూరంలో ఉన్న మాకు తెలిసిపోయేది. ఎందుకంటే దాని ఎనిమిది రకాల చప్పుళ్ళు ఒక స్పెషాలిటీ. స్టార్ట్ ముందు, తర్వాత, మధ్యలోనూ, రోడ్డుని బట్టీ సిటీ బస్సు చప్పుడు కంటే ఎక్కువ గా ఉండేది. ఆ రోజుల్లో అన్ని కార్లూ ముందు ఓ కన్నంలో ఇనప రాడ్ పెట్టి జబ్బలు నొప్పెట్టేలా వంద సార్లు తిప్పడమో, లేదా డ్రైవర్ కారులో స్టీరింగ్ తిప్పుతూ ఉండగా వంద గజాలు స్పీడుగా తోస్తే కానీ ఇంజన్ స్టార్ట్ అయ్యేవి కాదు. నా విషయంలో జబ్బలు నొప్పెట్టడం మాట నిజమే కానీ, మిగతా వాళ్ళలా కండలు తిరగ లేదు.

ఇక బొంబాయి వెళ్ళాక మా ఐఐటి కేంపస్ మొత్తంలో నలుగురు ప్రొఫెసర్లకి మాత్రమే కార్లు ఉండేవి. అందులో మా గురువు గారు -నమ్మండి, నమ్మక పొండి ఆయన పేరు కారే.. -సుబీర్ కార్...ఆయన దీర్ఘకాయుడు..అంటే పొడుగులో కాదు. వెడల్పులో. ఆ బెంగాలీ ఆయనకి లాండ్ మాస్టర్ అనే నీలం రంగు కారు ఉండేది. దానికి ఒకటే రోగం. ఆయన కూచోగానే సిగ్గుతో కుచించుకు పోయేది. టైర్లు పల్చగా, ఫ్లాట్ గా అయిపోయేవి. అంత కంటే ముఖ్యంగా అది మా కేంపస్ లో అందంగా ఉండే చిన చిన్న కొండలలో ఆ క్రిందకి బాగానే దిగిపోయేది కాబట్టి ఠకీ మని ఆనందంగా స్టార్ట్ అయిపోయేది. కానీ దాన్ని మళ్ళీ కొండ మీదకి ఎక్కడానికి స్టార్ట్ చెయ్యాలంటే మహా యజ్ఞం చెయ్యాల్సిందే. దాన్ని పట్టు పట్టి వెనక్కి దొర్లుకొచ్చెయ్యకుండా వెనకాల ముగ్గురు 'దాపు కాయుట', కారు ముందుకు పోవుటకు మరో ముగ్గురు ఇరుపక్కల నుండీ "టోయుట', అటూ. ఇటూ కారు స్టీరింగ్ తిరిగిపోకుండా మా వెడల్పాటి ప్రొఫెసర్ గారు డ్రైవర్ సీటులో కూచుని బెంగాలీలో ఎల్లారీశ్వరి పాటలు పాడేసుకొనుట...ఇది మా రొటీన్. ఆయన అమెరికాలో విస్కాన్సిన్ లో చదువుకున్న మంచివాడే అయినా ఈ కారు "టోయుట' లో సహకరించక పోతే మన డాక్టరేట్ కి ఆయన

సహకరించడేమో అని కార్ గారి కారు టోయుట ప్రాక్టీసు బొంబాయిలో కూడా కొనసాగించాను. నా మాట నమ్మకపోతే పదేళ్ళ తరవాత సరదాగా తీయించుకున్న ఆ నీలం కారు 'టోయుట" ఫోటో ఇక్కడ జతపరిచాను.

ఈ నోది అంతా ఎందుకంటే నేను పవిత్ర భారత దేశంలో నివశించినన్నేళ్లూ కార్లు 'టోయుట' యే కాని 'టోయించు కొనుట" అంటే తెలియదు. ఎందుకంటే నాకంటూ సొంత కారు లేదు. అసలు అలా 'టొయ్యుటకు మనుషులు కాక 'టో ట్రక్కులు' అనే అద్భుత యంత్రాలు ఉంటాయి అని అమెరికా వచ్చాక తెలిసింది. తెలియడమే కాదు వాటిని వాడుకోడంలో నన్ను మించిన వాడు లేదు అని మొన్ననే గిన్నిస్ బుక్ వారు తమ పుస్తకంలో నా పేరు నమోదు చేసి శాలువాతో గౌరవించుకోడానికి ఆసక్తి తెలియజేశారు. ఇక అమెరికాలో అవసరం వచ్చినప్పుడు తమ మెంబర్ల కార్లు 'టోసే' రక్షించే అమెరికన్ ఆటోమొబైల్ అసోసియేషన్ అనే సంస్థ వారు నా 'తోయించుకునే' ధాటీకి తట్టుకోలేక నేను కావలసినంత డబ్బు కడతాను అని బతిమాలినా కూడా ఏదో ఒక వెధవ కారణం చెప్పి నాకు మెంబర్ షిప్ ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారు.

అమెరికాలో నా తొలి టోయింగ్ అనుభవం మా క్వీన్ విక్టోరియా ధర్మమే!. అప్పుడెప్పుడో....అంటే చాలా, చాలా ఏళ్ల క్రితం ఓ సారి ఆవిడ కారు రోడ్డు మధ్యలో హఠాత్తుగా ఆగిపోయింది. ఆ రోడ్డుకి ఇరవై అడుగులకి అవతలి వేపే ఓ కారు రిపేరు షాపు ఉంది.  అదే ఇంకా డెవలప్ అవని అమరావతి అయితే వోలోమని ఓ వంద మంది ఆ కారు చుట్టూ మూగి 'ఏమైంది మేడం' అని పలకరించి చోద్యం చూసే వారు. ఆ కారు రిపేరు షాపు వాడు 'ఒరే, అప్పారావ్ ..రోడ్డు మీద బేరం వొచ్చింది సూసిరా" అని మెకానిక్ ని పంపించే వాడు. అందరూ కలిసి ఆవిడని కారు లోంచి కాలు కింద పెట్టకుండా అలాగే 'టోసి', కోకోకోలా అవీ ఇచ్చి గౌరవం చేసే వారు. కానీ ఇది డెవలప్ అయిపోయిన అమరావతి లాంటి అమెరికా కదా. ఓ ఒక్క దొర వెధవా ఆగ లేదు సరి కదా, అటూ, ఇటూ కార్లు మరింత జోరుగా దూసుకు పోతూ ఆవిడని బెదర గొట్టేశాయి. మొత్తానికి ఆవిడ కారు దిగి ఎలాగో అలా రోడ్డు దాటి ఆ కారు రిపేరు వాడి దగ్గరకి వెళ్లి అప్పటికి ఇంకా వచ్చీ రాని ఇంగ్లీషులోనూ, చేతి సౌంజ్ఞలతో చచ్చిన శవంలా పడి ఉన్న..అవును...మా టొయోటా కారుని... చూపించి సహాయం అడిగింది.

ఆ జాన్సన్ గాడు 'వాకే, వాకే' అని ఆ కారు ఇక్కడికి "టోయుటకు' $75 అవుతుంది, ఇస్తావా, చస్తావా?" అన్నాడు. "చస్తే ఇవ్వను. వెధవది ఇరవై అడుగులు తోయడానికి అంత డబ్బా. అదే మా వైజాగ్ లో అయితేనా" అని వాణ్ణి కోప్పడి "ఉండు, మా ఆయన్ని పిలుస్తాను" అని ఓ పావలా అక్కడి పే ఫోన్ లో వేసి నా ఆఫీసుకు పిలిచింది. నేను విష్ణుమూర్తి గజేంద్రుడి టైపులో ఆఘుమేఘాల మీద మా ఆడంగులని రక్షించడానికి అక్కడికి వెళ్ళగానే తెలుపు, నీలం, ఎరుపు రంగుల లైట్లు దేదీప్యమానంగా వెలిగించుకుంటూ 'రోడ్డు మీద మర్డర్ అయినట్టు లేదూ" అని ఓ పోలీసు కారు, నాలుగైదు టో ట్రక్కులు మాట్లాడుకుంటూ ఓ

పెద్ద సీను కనపడింది. మొత్తం సీన్ చూసి ఆవిడకి ఏమయిందో అని హడిలి పోయాను. ఈ వెధవ అమెరికాలో పొరపాటున రోడ్డు మీద కారు ఆగిపోతే చాలు. ఎలా తెలుస్తుందో ఏమో కానీ పది నిముషాలలో రోడ్డుకి అడ్డంగా ఉన్న ఆ కారు 'టో' చేసేసి ట్రాఫిక్ ఇబ్బంది పడకుండా ఉండడానికి. వీళ్ళందరూ శవాల మీద కాకుల్లా వాలిపోతారు. అయితే నేను అలవాటు కొద్దీ మా టొయోటాని తొయ్యడం మొదలు పెడుతుంటే సదరు పోలీసు ఆసామీ వికటాట్ట హాసం చేసి ఇంగ్లీషులో ప్రైవేటు చెప్పాడు. అనగా అమెరికా కారులు పౌరులు తోయలేరు. మరొక కారు మాత్రమే ఆ పని చెయ్య గలదు అని ఆయన చెప్పిన పాఠం. అంతియునే కాక ఐదు నిముషాలలో ఆ పని చెయ్యక పోతే ఆ వాహనము బందుల దొడ్లోకి  పంపించబడును అని వార్నింగ్ ఇచ్చాడు. బందుల దొడ్డికి తోయుట వారి ఖరీదు కేవలం 225 డాలర్లు మరియు కారు విడిపించుకునే వరకూ రోజుకి పాతిక డాలర్లు. ఆ రోజుల్లో నా జీతం వారానికి రెండు వందల డాలర్లు. ఇప్పుడు...వద్దు లెండి,,అది అప్రస్తుతం.

ఇక గత్యంతరం లేక, ఆ పోలీసు వాడు చెప్పిన మాట బుద్ధిగా వినేసి మా టొయోటాని $75 డాలర్లకి ఇరవై అడుగులు ఆ రిపేరు షాపుకి "టోయించగానే' జాన్సన్ గాడు అమందానంద కందళితుడో..మరేమిటో అయి, కిచ కిచలాడాడు. అసలు ఈ టొయోటా ఎందుకు ఆగిపొయిందీ అని జాన్సన్ ని అడిగితే 'మెషీన్ డయాగ్నొస్టిక్స్' కి $75, మాన్యువల్ గా సమస్య కనుక్కోవాలంటే నూట యాభై డాలర్లు మాత్రమే , ఆ తరవాత రిపేర్ కి వేరే అని శుభ వార్త చెప్పాడు. అమెరికాలో మనిషి కూలికి ఎక్కువా, అదే పని యంత్రం చేస్తే తక్కువ ఖర్చూ కాబట్టి 'సరేలే. మెషీన్ డయాగ్నొస్టిక్స్ తగలడు' అని ఇంకా ఏం కొంప ములుగుతుందో అని నేనూ, మా క్వీన్ విక్టోరియా ఆత్రుతగా కూచున్నాం. వాడు మా టొయోటాని పట్టాల మీదకి 'టోసి', కంప్యూటర్ లాంటి యంత్రానికి –ఆ రోజుల్లో దేన్ని చూసినా అది అయ్య బాబోయ్ కంప్యూటర్ అనే అనుకునే వాళ్ళం- కాస్సేపు ఓవర్ ఏక్షన్ చేసి...ఆ కారు ఎంతకీ స్టార్ట్ అవకపోతే అనుమానం వచ్చి కారుకి ఉండే ఐదారు కన్నాలలో డాక్టర్లు మనకి నోట్లోనూ, చెవిలోనూ టార్చ్ లైట్ వేసినట్టు తెగ ఫీలయిపోతూ పరీక్షలు నిర్వహించాడు. వాడి కొట్టు లోపలికి వెళ్లి కారు పక్కనే దగ్గర నుండి చూడ్డానికి వెధవ ఇన్సూరెన్స్ నిబంధనలు ఒప్పుకోవుట. వాడి బండారం బయట పడిపోతుంది అని అదో వంక. అదే పిఠాపురంలో అయితేనా?

అంచేత నేనూ, మా క్వీన్ విక్టోరియా గాజు తలుపుల్లోంచి బై పాస్ ఆపరేషన్ చూస్తున్నట్టుగా ఉగ్గబట్టుకుని జాన్సన్ గాడు మా 'టయాట'ని  పెడుతున్న చిత్రహింసలు చూస్తున్నాం.  మొత్తానికి వాడు లోపలకి వచ్చి "సారీ, మీకు ఈ సారీ ఆడపిల్లే, సారీ" అని చెప్తున్న డాక్టర్ లా మొహం పెట్టి "గెస్ వాట్?" అన్నాడు. చెప్పొద్దూ..నాకు ఒళ్ళు మండి పోయింది. అప్పటికే 150 డాలర్లు దండగ అయిపోయి నేను ఏడుస్తుంటే ఈ వెధవ నన్ను గెస్ చెయ్యమంటాడేమిటీ?

"గెస్సూ లేదు, గిస్సూ లేదు. అసలు సంగతి ఏడు' అన్నాను.

“కారు అంతా బావుంది కానీ, గాస్ పూర్తిగా అయిపోయింది. టాంక్ లో పెట్రోలు ఒక్క బొట్టు కూడా లేదు. అంగుళం కూడా మీ కారుకి కదిలే ఓపిక లేదు. టొయోటా అయినా టోయుట తప్పదు.” అన్నాడు జాన్సన్.

అర క్షణం ..అంతే.. మా క్వీన్ విక్టోరియా మొహం పాలిపోయింది.

మా పెళ్ళయ్యాక ఆవిణ్ణి అంత తెల్లగా ఎప్పుడూ చూడ లేదు. అంత సుకుమారంగా చూడగానే ఎందుకో అది నేను ప్రేమగా ఆవేశపడే సమయం బొత్తిగా కాదు అని నాకు అనిపించింది. అప్పటికే జాన్సన్ గాడు నా క్రెడిట్ కార్డు కోసం చేతులు జాపేసి మీద మీదకీ వచ్చేస్తున్నాడు.

ఈ కథలో నీతి ఏమిటంటే....టొయోటా కార్లు తోయించుకోకుండా ఉండాలీ అంటే సర్వకాల సర్వావస్థలలోనూ టేంక్ నిండా పెట్రోలు నిండియుండ వలెను. ఈ నీతి అన్ని వాహనములకునే కాక అందరూ స్త్రీలకూ వర్తించును.. అంతియునే కాక ఆ విధముగా ఇండియాలో వాటర్ టాంకులు నింపు కర్తవ్యం లాగానే అమెరికాలో భార్య కారు పెట్రోలు టాంకు ఎల్లప్పుడూ నిండుగా ఉంచు కర్తవ్యం భర్తలదే. లేని యడల ఆయా భర్తలు జాన్సన్ వాత పడుదురు. అది నన్ను చూసి నేర్చుకొనుడు.

వచ్చే వారం ఇండియా వెళ్తున్నాను కాబట్టి ,,,మళ్ళీ పిఠాపురం వెళ్లి ఆ కారు ‘తోయుట” చూడాలని ఉంది. రమణా రెడ్డి ఇంకా ఎంత ఎదిగాడో ఏమిటో?

❖❖❖❖❖



**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

**INDAUS IMMIGRATION**

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***

Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com

## వాహిని పాఠకుల స్పందన

**మార్చి 2020 పై అభిప్రాయాలతో వాహినికి లేఖ:**

**అద్యాత్మిక ప్రవచనాలకు కూడా ప్రోత్సాహమిస్తున్న వాహిని సేవలు కడు ప్రశంసనీయము... ఉపయోగించుకున్న కొలది మెదడు పదునవుతుంది... సంపాదకీయంలో విజయగారు చెప్పింది అక్షర సత్యం... భగవద్గీతలో భీష్ముడి ప్రాముఖ్యం, కౌరవ సైన్యంలో ఆయన ప్రాధాన్యత గురించి బాగా తెలియజేసారు...**

**పంచాంగం ప్రాముఖ్యత సిడ్నీ పత్రిక వాహినిలో చదవటం తెలుగు వారికే గర్వకారణం... తెలుగు సాహితీ సదస్సు గురించి ఇచ్చిన వివరణ, మీరు తెలుగు భాష కోసం చేస్తున్న కృషి తెలియజేస్తున్నది... పొత్తూరి విజయలక్ష్మి గారి 'అమ్మ ఫోటో' బావుంది... తల్లి కోసం వెతికిన విధం బాగుంది...**

**వంగూరి చిట్టెన్ రాజుగారి కవిత్వంలో హాస్యాన్ని బాగా చొప్పించారు...**

**శ్రీమతి షామీర్ జానకీ దేవి,హైద్రాబాద్**

❖❖❖❖❖



❖❖❖❖❖

ARA VAULTS

SAFE DEPOSIT BOXES

SECURE YOUR VALUABLES

BULLION JEWELLERY DOCUMENTS DATA CURRENCY

WESTERN SYDNEY'S

MOST SECURE SAFE DEPOSIT BOXES

OWNED & OPERATED BY INDUSTRY EXPERTS

Our private, state-of-the-art vault is equipped with multiple layers of advanced electronic security, providing our members with both world-class security and peace of mind. Visit ARA Vaults today to learn how we can provide the most secure storage for your valuables.




PH: 02 8326 7907

aravaults.com.au

# సంగీత నాదామృతం

డా. పద్మ మల్లెల, సిడ్నీ



ఇంతవరకూ మనం రాగం దాని పుట్టుక, దాని విభజన వంటి విషయాలను చర్చించుకున్నాంకదా! ఇప్పుడు మళ్ళీ కొంత భిన్నంగా తాళం దాని లక్షణాలను గురించి తెలుసుకుందాం.

తాళ విభజన గురించి గత సంవత్సరం ఒక సంచికలో చెప్పుకున్నాం. దానికి ముందు తాళం అంటే ఏంటో తెలుసుకుందాం. ఈ సృష్టిలో సాంకేతికంగా నాదం అని పిలువబడే ధ్వని తరంగాలు ఒక శృతిని సంతరించుకొని స్వరాలుగా ఏర్పడ్డాయి. అవే మన సంగీతంలోని అసంఖ్యాక రాగాల నిచ్చాయి. అలాగే సృష్టిలోని కాలం అనే ప్రమాణం సంగీతంలోని తాళం గా ఏర్పడింది. ఎలాగయితే ధ్వని తరంగాలు రాగాలయినవో సమయంలోని గమనం సంగీతంలో తాళ గమనం అయిందన్నమాట.

స్వరాలు రాగానికి ఆధారమయితే తాళానికి ఆధారం 'అక్షరకాలం' గా పేర్కొనవచ్చు. మామూలుగ మనం చూసే గడియారానికి 'seconds hand' మరియు 'Minit hand' ఎలాగో అలా 'అక్షరకాలం' సంగీతా నికి అన్నమాట.

తాళ శబ్దానికి ఈ క్రింది శ్లోకంలో వివిరింప బడింది.

"త కార శంకర ప్రోక్తో లకార శక్తి రుచ్యతే
శివ శక్తి సంయోగాత్ తాళ ఇత్యభిధీయతే"

**గానభాస్కరం** అనే గ్రంధం ప్రకారం పైన శ్లోకం లో తాళం అనే పదం లోని తకారం శివుడికి సంబంధించిన బీజాక్షరంగాను, లకారం శక్తికి సంబంధించిన బీజాక్షరంగా పేర్కొనబడింది. ఇంకా వివరంగా చూస్తే శివ శక్తుల నాట్యంలో శివతాండవం లోని తకారం, శక్తి లాస్యం లోని లకారం కలిపి తాళ శబ్దం జనించిందని పేర్కొనబడింది.

"హస్తద్వయస్య సంయోగే వియోగం చాపి వర్తతే
వ్యాప్తిమన్ యో దశ ప్రాణైః సకల తాళ సంజకః"

అనగా మన శరీరంలోని రెండు చేతులు మరియు సంగీత గమనం లోని పది ప్రమాణాలతో చేరిక తాళానికి మూలంగా చెప్పుకోవచ్చు. అలాగే మానవ మనుగడ ఎలాగయితే **'పృథివ్యాపస్తేజో వాయురా కాశ'** అని చెప్పబడిందో ఈ క్రింద పేర్కొన బడే పది ప్రాణాలు తాళానికి ఆలంబనంగా చెప్పబడ్డాయి. అవి ఏవంటే:

1) కాల ప్రాణము 2) మార్గ ప్రాణము 3) క్రియ ప్రాణము 4) అంగ ప్రాణము 5) గ్రహ ప్రాణము 6) జాతి ప్రాణము 7) కళా ప్రాణము 8) లయ ప్రాణము 9) యతి ప్రాణము మరియు 10) ప్రస్తార ప్రాణము.
ఈ సంచికలో మనం ముందు మూడు ప్రాణాల గురించి తెలుసు కుందాం.

ముందుగా కాల ప్రాణం అంటే ఏమిటో తెలుసు కుందాం. దీనిని సంగీత గమనాన్ని నిర్దేశింపగలిగే ప్రమాణంగా పేర్కొనవచ్చు. ఆంగ్లంలో చెప్పుకోవాలంటే "it is the authority to fix the duration or magnitude of the different angas". ప్రతి తాళానికి దాని యొక్క అక్షర కాలం నిర్దేశింపబడి ఉంటుంది. ఉదాహరణకి ఆదితాళానికి 8 అక్షర కాలం మరియు రూపక తాళానికి 6 అక్షరాల కాల గమనం ఉంటుంది.
ఈ 8 అక్షర ప్రమాణం గల ఆది తాళాన్ని హిందూస్తానీ సంగీతంలో 'తీన్ తాళ్' అని వ్యవహరిస్తారు. అయితే దీని అక్షరకాలం నిర్దేశింప బడింది కానీ దాని తీవ్రత ఎవరికి తగ్గ విధంగా వారు కొంత వరకూ నిర్దేశించు కోవ చ్చు.

ఇంకా వాడుకలో ఉన్న తిశ్ర ఏకతాళం లో 3 అక్షర కాలాలు ఉంటాయి. ఎక్కువ భాగం అన్నమయ్య కీర్తనలు మరియూ జానపద గీతాలు ఈ తాళం లో ఉంటాయి. తరువాత పేర్కొన దగిన వాడుకలో ఉన్న ఖండ చాపుకు 5 అక్షరకాలాలు, మిశ్ర చాపుకు 7 అక్షర కాలాలు ఉంటాయి.

ఇంకా ఈ కాల ప్రాణంలో తెలుసుకో వలసిన ముఖ్య మైన విషయం ఏమిటంటే ఒకే తాళంలో 3 కాలాలను పాడటం లేక వాయించటం. ఈ 3 కాలాలు క్రిందివిధంగా ఉంటాయి:

1. ప్రధమ కాలం లేక మొదటి కాలం అంటే 8 అక్షర కాలాలలోని ఒక్కొక్క అక్షర కాలానికి ఒక అక్షరం
2. ద్వితీయ లేక రెండో కాలంలో ఒక అక్షర కాలానికి 2 అక్షరాలు ఇక
3. తృతీయ కాలానికి ఒక్కొక్క అక్షర కాలానికి 4 అక్షరాల చొప్పున ఉంటాయి.

ఇక తాళ దశ ప్రాణాలలో రెండో ప్రాణం మార్గ ప్రాణం గురించి తెలుసుకుందాం. ఈ మార్గ ప్రాణం ఒక తాళంలో ఒక రచన యొక్క గమనాన్ని తెలియ చేస్తుంది. ఇది సాధారణంగా 5 రకాలు

1. అతి చిత్ర తర 2) చిత్రతర 3) మధ్యమ 4) చిత్ర తమ మరియు 5)అతి చిత్ర తమ. ఇవి విలంబిత లయనుండి దురిత లయ వరకూ ఉంటుంది. దైనందిన వ్యవహారంలో దీన్ని speed of a composition గా చెప్పుకోవచ్చు.

ఇక మూడవ దైన క్రియా ప్రాణం. క్రియ అంటే మనంచేసే పనిని క్రియ అంటార కదా అలాగే ఒక తాళాన్ని వేసేప్పుడు చేతితో తెలియచేసే అంగాలను క్రియ అంటారు. ఉదాహరణకి ఆది తాళం లో 8 క్రియలు ఉంటాయి. మొదటిది ఒక దెబ్బ అంటే అరచేతిని కాలుమీద కానీ లేక ఒక చేత్తో వేరొక చేతిలో కొట్టుట. తరువాత 3 వేళ్ళను ఎంచుట తరువా త వేరొక దెబ్బ తదుపరి చేతిని తిప్పి విసురుట తరువాత మళ్ళీ ఒక దెబ్బ మరియు చేతిని విసురుట కలిపి 8 క్రియలు అనునది ప్రస్తుత ము వాడుకలో కలది. ఇక తాళానికి కల 6 అంగాలు (షడంగాలు) మరియు సప్త తాళ అలంకారాలు మొదలయిన వాటి వివరణ ముందు సంచికలలో వివరింపబడింది. మిగిలిన 7 ప్రాణాల గురించి వచ్చే సంచికలో తెలుసు కుందాం.

ఇక ఇప్పుడు శ్రీరామ నవమిని పురస్కరించుకొని 'సీతమ్మ మా యమ్మ' అనే వసంత రాగం లోని త్యాగరాజస్వామి కీర్తనను చర్చించు కుందాం. ముందుగా కీర్తన సాహిత్యం:

పల్లవి:

సీతమ్మ మా యమ్మ శ్రీ రాముడు మా తండ్రి

అను పల్లవి:

వాతాత్మజ సౌమిత్రి వైనతేయ రిపుమర్ధన
దాతా భరతాదులు సోదరులు మాకు ఓ మనసా
||సీతమ్మ ||

చరణం:
పరమేశ వశిష్ఠ పరాశర నారద శౌనక శుక
సురపతి గౌతమ లంబోదర గుహ సనకాదులు
ధర నిజ భాగవతాగ్రేసరులెవ్వరో వారెల్లరు
వర త్యాగరాజునికి పరమ బాంధవులు మనసా
|| సీతమ్మ ||

ఈ కీర్తన త్యాగరాజ స్వామి వారి రచనా పటిమకు అద్దంగా చెప్పుకోవచ్చు. ఇందులో ఆయన ఆత్మ ప్రబోధం (self motivation) అనే ఒక ప్రక్రియ అనుసరించారు. ఆయన తన మనసుకు సీతమ్మ మనకి తల్లి శ్రీ రాముడు మనకి తండ్రి అంటే ఈ ప్రపంచానికి సీతా రాములు తల్లి తండ్రులు అని పేర్కొన్నారు. వారిద్దరు మనకి తల్లి తండ్రులు కాబట్టి లక్ష్మణుడాదిగా రాముని సోదరులు మరియూ హనుమంతుడు, వైనతేయుడు అంటే గరుత్మంతుడు మనకి సోదరులు గా అన్వయించారు. ఇక్కడ మనకి మనం అందరం ఆపదలో ముందుగా చదువుకునే తులసీదాస విరచిత 'హనుమాన్ చాలీసా' లోని కొన్ని శ్లోకాలు స్ఫురణకి వస్తాయి. ఉదాహరణకి:

'కహా భరత సమ తుమ ప్రియ భాయీ'

ఇక చరణానికి వస్తే పైన పేర్కొన్న రాముని సోదరులు కాక రాముని ఆత్మ బంధువుగా కీర్తించే వారందరూ కూడా త్యాగరాజుకు అంటే మనకి కూడా చాలా దగ్గర చుట్టాలట! ఎంత చక్కని ఊహ! అది ఎలాగో చూద్దాం. 'పరమేశ' అంటే ఈశ్వరుడు. ఇక్కడ మనం ఎప్పు డూ చదువుకునే ఈశ్వర ప్రోక్తమయిన 'శ్రీ రామ రామేతి' అనే శ్లోకం స్ఫురణకి వస్తుంది కదా? ఇక్కడ త్యాగరాజ స్వామి వారి పరమ అద్వైత తత్వం బోధ పడుతుంది.

ఇక శంకరుని తరువాత మహా మునులందరినీ పేర్కొ న్నారు. వారు ' వశిష్టుడు, పరాశరుడు, నారదుడు, శౌనకుడు, శుక మహర్షి' మొదలయినవారు. ఇక తరు వాత క్రమం ఏ ఏ దేవతలు మనకి బంధువులో చూడండి. 'సురపతి' అంటే ఇంద్రుడు, గౌతముడు, లంబోదరుడు అంటే సకల విఘ్న హర్త అయిన వినాయకుడు,గుహ అంటే సుబ్ర హ్మణ్య స్వామి, సనకాదులు అంటే సనక సనందనులట!

ఇక కవితా పరంగా కీర్తన ఆసాంతం అనుప్రాస అనే కవితా లక్షణం కనబడుతుంది. ఉదాహరణకి సీతమ్మ మా యమ్మ అనేచోట మకార ప్రాస అనుపల్లవితో తకార ప్రాస, చరణం మొత్తంగా ఉన్న రకార ప్రాస గమనార్హం. ఇక పైన పేర్కొన్న తాళ దశ ప్రాణాల ప్రకారం ఈ కీర్తన రూప క తాళంలో ఉంది. అంతే కాక ఇది చిత్ర తమ మార్గానికి ఉదాహరణ గా ఈకీర్తనను పేర్కొన వచ్చు. అంతేకాక ఈ కీర్తన 17 వ మేళకర్త అయి న సూర్యకాంత రాగ జన్యమైన అతి రంజకమయిన వసంత రాగంలో ఉంది.

కనుక ప్రస్తుతం ప్రపంచం లోని సంక్లిష్ట పరిస్థితుల్లో ఈ కీర్తన గురించిన వివరణ ద్వారా పాఠకులకు కొంత స్వాంతన చేకూరాలని ఆశిస్తున్నా ను. అంతేకాక ఈ రచనతో త్యాగరాజ స్వామి వారి తద్వారా సీతా లక్ష్మణ హనుమ స్సమేత శ్రీ రామచంద్ర స్వామి వారి అఖండ కరుణా కటాక్షాలు శ్రీ రామనవమి పర్వ దినాన అందరికీ కలగాలని ఆశిస్తూ పాఠకులందరికీ శ్రీ రామ నవమి శుభాకాంక్ష లతో, సెలవు.

**సంగీత విద్వాస్ శ్రీ మంగళంపల్లి బాలమురళికృష్ణ గారి గళంలో ఈ కీర్తన లింకులో విని ఆస్వాదించండి.**

https://www.youtube.com/watch?v=POoiD8qLITc

❖❖❖❖❖




# రాజా రవివర్మ

కూర్పు. సేకరణ శ్రీమతి విజయ గొల్లపూడి



భారతీయ చిత్రకారుడు రాజా రవి వర్మ గీసిన చిత్రాలు ఎంత అద్భుతంగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చీరకట్టుకున్న స్త్రీలను అందంగా, చక్కని వంపు సొంపులతో చిత్రించడంలో ఆయనకి ఆయనే సాటి. రామాయణ, మహాభారతములలోని ఘట్టాలను చిత్రాలుగా మలచి మంచి గుర్తింపు పొందారు. భారతీయ సాంప్రదాయిక, పాశ్చాత్య చిత్రకళా మెళకువల సంగమానికి ఆయన చిత్రాలు దర్పణాలు. 1873 లో జరిగిన వియన్నా కళా ప్రదర్శనలో ఆయన చిత్రాలు మొదటి బహుమతిని పొందినపుడు రాజారవివర్మ గురించి ప్రపంచానికి తెలిసింది. భారతీయ చిత్రకళా చరిత్ర పుటలలో  ఒక గొప్ప చిత్రకారునిగా స్థానం ఏర్పరుచుకున్న రాజా రవివర్మ ఏప్రిల్ 29  1848 తేదీన కిలమానూర్, కేరళలో జన్మించారు. ఆయన జయంతి సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసం,  వారి చిత్రాలు కొన్ని ఇక్కడ అందిస్తున్నాము.

ఆయన 1906 వ సంవత్సరంలో మరణించారు. ఆయన మరణించే సమయానికి కిలమానూరు ప్యాలెస్ లో దాదాపు 160 దాకా రవివర్మ చిత్రాలు ఉండేవని ప్రతీతి. తరువాత వాటిని అధికారికంగా తిరువనంతపురంలోని చిత్రా ఆర్ట్ గ్యాలరీకి అందచేసారు.



SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145



# కామేశ్వరి



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra times are finishing and Varjyam times are start to finish - Standard or Daylight Saving Time (AEST/NZDT) as applicable in Australia.

## ఏప్రిల్ 2020

శ్రీ శార్వరి చైత్ర శు సప్తమి నుండి వైశాఖ శు సప్తమి వరకు

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిథి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

పంచాంగ కర్తలు: నేతి శివరామకృష్ణ శాస్త్రి (సిడ్నీ) & కర్రా భాస్కర శర్మ (మెల్బోర్న్)

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆది**<br>రా - 16:30 to 18:30 | **Festivals & Holidays**<br>02 – శ్రీ Ramaనవమి<br>10 – Good Friday<br>13 – Easter Monday<br>27 – ANZAC Day<br>28 – Sankara Jayanti | **5**<br>శు ఏకాదశి 2:53<br>శు ద్వాదశి 23:42<br>మఖ 19:22<br>వ 8:30 - 9:56<br>AEST starts today | **12**<br>బ పంచమి 21:40<br>అనురాధ 0:41<br>జ్యేష్ఠ 23:45<br>వ 6:4 - 7:36 | **19**<br>బ ఏకాదశి 2:40<br>శతభిషం 8:56<br>వ 16: 9 - 17:57 | **26**<br>శు తదియ 17:45<br>కృత్తిక 1:31<br>వ 18:48 - 20:32 |
| **సోమ**<br>రా - 7:30 to 9:30 | **Sydney**<br>Sun Rise Set<br>1 7:08 18:49<br>8 6:13 17:40<br>15 6:18 17:31<br>22 6:23 17:22<br>29 6:29 17:15 | **6**<br>శు త్రయోదశి 20:12<br>పుబ్బ 16:38<br>వ 2:27 - 3:52<br>వ 22:57 - 0:22 | **13**<br>బ షష్ఠి 20:42<br>మూల 23:32<br>వ 21:57 - 23:32 | **20**<br>బ ద్వాదశి 5:11<br>పూర్వాభాద్ర 11:53<br>వ 22:40 - 0:28 | **27**<br>శు చవితి 8:58<br>రోహిణి 3:27<br>వ 9:25 - 11: 7 |
| **మంగళ**<br>రా - 15:00 to 16:30 | **Melbourne**<br>Sun Rise Set<br>1 7:01 17:33<br>8 7:08 17:26<br>15 7:14 17:19<br>22 7:19 17:14<br>29 7:25 17:11 | **7**<br>శు చతుర్దశి 16:21<br>ఉత్తర 13:43<br>వ 21: 1 - 22:24 | **14**<br>బ సప్తమి 20:37<br>పూర్వాషాఢ పూర్తి<br>వ 9:22 - 11: 1 | **21**<br>బ త్రయోదశి 7:38<br>ఉత్తరాభాద్ర 14:51<br>వర్జ్యం లేదు | **28**<br>శు పంచమి 19:38<br>మృగశిర 4:59<br>వ 13:47 - 15:28 |
| **బుధ**<br>రా - 12:00 to 13:30 | **1** చైత్ర<br>శు సప్తమి 9:18<br>మృగశిర 0:16<br>ఆరుద్ర 1: 6<br>వ 0:34 - 0:37<br>వ 9:30 - 11: 6 | **8●**<br>శు పూర్ణిమ 12:26<br>హస్త 10:34<br>వ 17:33 - 18:57 | **15**<br>బ అష్టమి 21:17<br>పూర్వాషాఢ 0:8<br>వ 8:38 - 10:19 | **22**<br>బ చతుర్దశి 10: 2<br>రేవతి 17:51<br>వ 4:21 - 6:9 | **29**<br>శు షష్ఠి 19:39<br>ఆరుద్ర 6 9<br>వ 18:22 - 19:59 |
| **లక్ష్మి**<br>రా - 13:30 to 15:00 | **2**<br>శు అష్టమి 9:10<br>ఆరుద్ర 1:6<br>వ 13:4 - 14:39 | **9**<br>బ పాడ్యమి 8:36<br>చిత్ర 7:30<br>వ 12:28 - 13:54 | **16**<br>బ నవమి 22:34<br>ఉత్తరాషాఢ 1:37<br>వ 5:57 - 7:41 | **23●**<br>బ అమావాస్య 12:19<br>అశ్విని 20:36 వ 16: 8 - 17:55 | **30** వైశాఖ<br>శు సప్తమి 19: 4<br>పునర్వసు 6:35<br>వ 14:31 - 16: 6 |
| **శుక్ర**<br>రా - 10:30 to 12:00 | **3**<br>శు నవమి 8:10<br>పునర్వసు 1:1<br>వ 8:44 - 10:16 | **10**<br>బ విదియ 5: 6<br>స్వాతి 4:48<br>వ 9:51 - 11:17 | **17**<br>బ దశమి పూర్తి<br>శ్రవణం 3:37<br>వ 8:1 - 9:47 | **24** వైశాఖ<br>శు పాడ్యమి 14:25<br>భరణి 23: 7<br>వ 7:12 - 8:58 | Daylight Saving Time Ends on Sunday, 05 Apr 2020 |
| **శని**<br>రా - 09:00 to 10:30 | **4**<br>శు దశమి 6:25<br>పుష్యమి 0:9<br>ఆశ్లేష 22:37<br>వ 12: 8 - 13:38 | **11**<br>బ తదియ 2: 2<br>బ చవితి 23:31<br>విశాఖ 2:26<br>వ 6:8 - 7:37 | **18**<br>బ దశమి 0:27<br>ధనిష్ఠ 6:4<br>వ 14: 9 - 15:56 | **25**<br>శు విదియ 16:18<br>కృత్తిక పూర్తి<br>వ 12:19 - 14: 5 | **School Holidays**<br>Vic: 28 Mar – 13 Apr<br>NSW: 10 Apr -26 Apr |

namostu ramaya salakshmanaya devyaicha tasyai janakatmaManmadhai |
namostu rudrendra yamanilebhyo namostu chandrarka marudganebhyaha ||

# BRAND NEW MELBOURNE CBD & SOUTHBANK APARTMENTS

**1, 2 & 3 beds from $489,000* (Off-the-plan)**




Walk to Melbourne city centre, Arts Precinct, shopping, cafes, restaurants, parks, transport & more.

Easy Access to RMIT & Melbourne University.

Exclusive resident facilities: Indoor pool, gym, terrace courtyard, BBQ, concierge & more.

✔ **Low Owners Corporation Fees (Strata Fees)**

BUY DIRECT *from* AUSTRALIAN OWNED DEVELOPER

**INSPECT IN SYDNEY OFFICE BY APPOINTMENT:**

**299 Elizabeth Street, Sydney**

**1800 44 55 20**

Multilingual staff available, many Indian languages spoken

**centralequity.com.au**

CENTRAL EQUITY 30TH YEAR CELEBRATION

AWARD WINNING MELBOURNE DEVELOPER

*OVER 75 PROJECTS DELIVERED AS PROMISED*

**Price as at 28/6/2018 until sold.*

# పాట నేర్చుకుందామా/పాడుకుందామా

**చిత్రం: శ్రీ రామదాసు**

**సంగీతం: ఎం.ఎం కీరవాణి**

**సాహిత్యం: శ్రీ రామదాసు**

**గానం: శ్రీ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం**

అంతా రామమయం!

ఈ జగమంతా రామమయం!!

రామ రామ రామ రామ రామ రామ రామ

అంతా రామమయం .ఈ జగమంతా రామమయం!

అంతా రామమయం .ఈ జగమంతా రామమయం!!

అంతా రామమయం!!!

అంతరంగమున ఆత్మారాముడు.

రామ రామ రామ రామ రామ రామ రామ

అనంత రూపముల వింతలు సలుపగ

రామ రామ రామ రామ రామ రామ రామ

సోమసూర్యులును సురలు తారలును ఆ మహాంబుధులు అవనీజంబులు

అంతా రామమయం .ఈ జగమంతా రామమయం!

అంతా రామమయం!!

ఓం నమో నారాయణాయ!

ఓం నమో నారాయణాయ!!

ఓం నమో నారాయణాయ!!!

అండాండంబులు పిండాండంబులు బ్రహ్మాండంబులు బ్రహ్మలు మొదలుగ

నదులు వనంబులు నానామృగములు విదిత కర్మములు వేద శాస్త్రములు

అంతా రామమయం .ఈ జగమంతా రామమయం!

రామ రామ రామ రామ రామ రామ రామ!

సిరికిన్ జెప్పడు.శంఖచక్రయుగమున్ చేదోయి సంధింపడు

ఏ పరివారంబును జీరడు.అభ్రకపతిన్ బంధింపడు

ఆకర్ణికాంతర ధన్ విల్లము చక్క నొక్కడూ.

నివాదప్రోద్ధిత శ్రీకుచోపరి చేలాంచలమైన వీడడూ.

గజప్రాణావనోత్సాహియై!

https://www.youtube.com/watch?v=TLfOhQGDzvY

❖❖❖❖❖







❖❖❖❖❖




08:00 - 10:00 AM Sydney Time on Sat
02:30 - 04:30 AM India time
16:00 - 18:00 Hrs New York Time (Day -1 or Fri)
[ For India/US +1 Hour during Australia Winter Time]

Listen to Radio on 2TripleO FM 98.5 or DAB 985 or

You can also listen on PC/ internet, the URL is:
https://2tripleo.com.au/en-au/
http://s7.viastreaming.net/8500/m/

The program can also be listened over phone-audio by dialling: **+61 2 8080 5650**

via **TuneIn** App on **Android | iPhone**

**తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని**
**2TripleO FM98.5 MHz**
**DAB 985**

**Saturdays 08:00 – 10:00AM Sydney Time**

27 సంవత్సరాలుగా సిడ్నీ తెలుగువారిని ప్రతి శనివారం ఉదయం 08:00 – 10:00 గంటల వరకు, మంచి మంచి అంశాలతో అలరిస్తూ, 25 ప్రసారకుల స్వచ్ఛంధ సేవలతో రేడియో కార్యక్రమాలను అందిస్తున్న తెలుగువాణి కార్యక్రమాలను
2TripleO FM 98.5 అలవరసాలపై
**వినండి. వినిపించండి. వింటూ ఉండండి.**
ప్రసారకులుగా కార్యక్రమాలు అందించాలనే ఆసక్తి ఉన్నవారు;
కారక్రమాలకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించ తలచుకున్నవారు;
వ్యాపార ప్రకటనలను ఇవ్వదలచుకొన్నవారు;
మా కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలియచేయాలనుకొనేవారు – సంప్రదించండి:

శ్రీ సారథి మోటమఱ్ఱి, 0430 022 130 or vani@sydneytelugu.org

**https://www.facebook.com/TeluguVaniSydney**

❖❖❖❖❖



## బాలవాహిని

**అక్కరకు రాని చుట్టము**

**మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమున దా**

**నెక్కిన బారని గుఱ్ఱము**

**గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ**

akkaraku rAni chuTTamu

mrokkina varamIni vElpu, mOharamuna dA

nekkina bARani guRRamu

grakkuna viDuvangavalayu gadarA sumatI

అవసరానికి పనికిరాని చుట్టాన్ని, ఎంత వేడుకున్నా వరం ఇయ్యని దైవాన్ని, యుద్ధంలో పరుగెత్తలేని గుఱ్ఱాన్ని నీతిమంతుడు (intelligent person) వెంటనే విడిచి పెట్టాలి.

**అప్పిచ్చువాడు వైద్యుడు**

**నెప్పుడు నెడతెగక బారు నేఱును ద్విజుడున్**

**జొప్పడిన యూర నుండుము**

**చొప్పడకున్నట్టి యూరు సొరకుము సుమతీ**

appicchuvADu vaidyuDu


neppuDu neDategaka bARu nERunu dvijuDun

joppaDina yUra nunDumu

choppaDakunnaTTi yUru sorakumu sumatI

అవసరమైన సమయంలో అప్పుదొరకని చోట, వైద్యుడు అందుబాటులో లేని చోట, ప్రవహించే నది లేని చోట, ఒక బ్రాహ్మణుడు లేని చోట  ఉండవద్దు.

❖❖❖❖❖


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by: DSLRCREW


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au


BIRYANI HOUSE
PARADISE
Biryani House
BIRYANI HOUSE
14 George Street North Strathfield
Open 7 Days for Lunch and Dinner
Call us : 0297635282


SoftLabs®
Demands Delivered
IT CONSULTING SERVICES COMPANY
TRAINING SERVICES
- SOFTWARE TESTING
- PRE SALES ANALYSIS
- BUSINESS ANALYSIS
- AGILE TRAINING
CONSULTING SERVICES
- CONTRACT MANAGEMENT
- PAYROLL MANAGEMENT
- RESOURCE MANAGEMENT
- STAFFING
CONTACT: SREENI PILLAMARRI P: 0410 756 040 | E :BUSINESS@SOFTLABS.COM.AU | W: WWW.SOFTLABS.COM.AU
SYDNEY | MELBOURNE | CANBERRA | ADELAIDE | BRISBANE | PERTH | TASMANIA




Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Sweet
UTSAV
Sweet UTSAV
When Only The Best Will Do
6/17 Brumby Street, Seven Hills, NSW, 2147 Tel: (02) 8608 7146 Mob: 0450 740 277

❖❖❖❖❖


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

తెలుగు బడి

Telugu Badi

# తెలుగు బడికి ఆహ్వానం

## Welcome to Telugu Language School

**We provide:**

- Caring teachers
- Personal attention
- Attractive learning activities
- Outcomes based teaching

**A great opportunity for your child to learn Telugu.**

Enrol in your nearest school today for 2020 starting on Sun, 2-Feb-2020.

**Our Schools:**

- Strathfield South PS
- Hambledon PS (Quakers Hill)
- Darcy Rd PS (Wentworthville)
- Eastwood PS
- Beaumont Hills PS (Kellyville)

**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details,

Visit: www.sydneytelugu.org

Call: 0402 169 963

Email: school@sydneytelugu.org




తెలుగు అసోసియేషన్ సిడ్న

